RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 151 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి సోమవారం 1-6-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు,జ్యేష్ఠ మాసం, తిథి॥ బహుళ పాడ్యమి మ॥2.52, జ్యేష్ఠ సా॥5.56, వర్జ్యం మ॥2.48 - 4.34, దుర్ముహూర్తం మ॥ 12.23-1.15, శుభ సమయం మ॥ 1.30-3.00, రాహుకాలం ఉ॥7.30-9.00, సూర్యోదయం ఉ॥ 5.30, సూర్యాస్తమయం సా॥ 6.21 గం॥

## లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

– ముగ్గురి మృతి



**విశాఖపట్నం, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గాజువాకలోని శ్రీనగర్ వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. రాజమహేంద్రవరం నుంచి రామభద్రాపురం వైపు వెళ్తోన్న ఆర్టీసీ బస్సు ఆగిఉన్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు, ఒక డ్రైవర్ మృతిచెందగా, ఏడుగురుకి గాయాలయ్యాయి. క్షతగాత్రులను విశాఖ కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కుట్ర రాజకీయాలు మానరా?

– తెదేపా కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్



**అమరావతి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసమైన ఘటనపై వైకాపా శ్రేణులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. దీనిపై ఏపీ మంత్రి, తెదేపా కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ స్పందించారు. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం చేసిన జమ్ములయ్య.. వైకాపా నేతల అనుచరుడేనని పోలీసులు తేల్చినట్లు చెప్పారు. బాబాయి గుండెపోటు, కోడి కత్తి, గులకరాయి నాటకాల రాయుడైన జగన్.. మరో కొత్త డ్రామా సృష్టించాడని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు తన గొడ్డలి పార్టీ కార్యకర్తలను సైకో జగన్ రంగంలోకి దింపారని మండిపడ్డారు. జగన్నాటకాలు చూసి జనం ఛీకొట్టినా.. డ్రామాలు మానట్లేదని అన్నారు. ఎన్ని సార్లు దొరికిపోయినా.. కుట్ర, క్షుద్ర రాజకీయాలు మానరా? అని ప్రశ్నించారు.

## విశాఖ కేంద్రంగా బుల్లెట్ రైలు

– భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



**విశాఖపట్నం, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దక్షిణ కోస్తా రైల్వే జోన్ రేపట్నుంచి ప్రారంభం కానుందని ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. రైల్వే జోన్‌కోసం 30 ఏళ్లుగా భాజపా పోరాడిందన్నారు. విభజన చట్టంలో రైల్వేజోన్ చేర్చడంలో ఆ పార్టీ కృషి అనిర్వచనీయమన్నారు. విశాఖ కేంద్రంగా బుల్లెట్ రైలు త్వరలో వస్తుందని రైల్వే మంత్రి చెప్పారని మాధవ్ వివరించారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రికి అశ్వినీ వైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# అవి భారతీయులకు గర్వకారణం

– అనైమంగళం రాగి శాసనాలపై మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో ప్రధాని మోదీ




**న్యూఢిల్లీ, మే 31 :** భారత అథ్లెట్ గుర్విందర్ సింగ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. రాంచీలో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల గురించి ఆదివారం మన్‌కీ బాత్ 134వ కార్యక్రమంలో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. వందమీటర్ల పరుగులో రికార్డులు సృష్టించిన అథ్లెట్లు గుర్విందర్, అనిమేష్‌తో ఆయన నేరుగా మాట్లాడారు. కేవలం రెండు రోజుల్లోనే 100 మీటర్ల పరుగు పందెంలో జాతీయస్థాయిలో మూడు రికార్డులు సృష్టించామని మోదీ అన్నారు. ఈ అద్భుతమైన ఘనత సాధించిన ఇద్దరు అథ్లెట్లు గుర్విందర్ సింగ్, అనిమేష్‌కు అభినందనలు తెలిపారు. మోదీ పర్యటన నేపథ్యంలో 'అనైమంగళం' రాగి శాసనాలను నెదర్లాండ్స్ ప్రభుత్వం భారత్‌కు తిరిగి అప్పగించిన సంగతి తెలిసిందే. ఇది భారతీయులు గర్వించదగిన విషయమని మోదీ అన్నారు. ఇక, ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ కాలువల చిక్కుకుపోయిన డాల్ఫిన్‌ను కొందరు దాదాపు 13 గంటలపాటు శ్రమించి రక్షించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ప్రధాని మోదీ ఈ సంఘటనను కూడా మన్‌కీ బాత్‌లో మాట్లాడారు.

గంటలపాటు శ్రమించి డాల్ఫిన్‌ను కాపాడినవారిని అభినందించారు. ఈ సహాయక చర్యల్లో కేంద్రం ఇటీవల కొత్తగా ప్రవేశపెట్టిన డాల్ఫిన్ అంబుల్స్ కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. కేరళలోని ఆలువా ప్రాంతంలో స్విమ్మింగ్ క్లబ్ సేవలను మోదీ ప్రశంసించారు. ఈ క్లబ్ ద్వారా ఇప్పటి వరకు 15వేల మందికి పైగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మోదీ పలు సూచనలు చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తాగునీరు వెంట ఉంచుకోవాలన్నారు. ఆయా రాష్ట్రాల్లో ఎండల నుంచి రక్షణ కోసం వాడే పానీయాలు మామిడి పండ్లు, మజ్జిగ, షర్బత్, బేల్‌పనా గురించి ప్రస్తావించారు.

## ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల

– మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇరిగేషన్‌పై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు

మిగతా 2లో..

## సాయుధ దళాల వ్యవస్థీకృత సంస్కరణలపైనే దృష్టి

కొత్త సీడీఎస్ రాజా సుబ్రమణి



**న్యూఢిల్లీ, మే 31:** భారత నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా జనరల్ రాజా సుబ్రమణి నేడు బాధ్యతలు స్వీకరించారు. మాజీ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ ఆయనకు బాధ్యతలను అప్పగించారు. దీంతో మిలటరీ థియేటరైజేషన్ బాధ్యతలను ఇక నుంచి సుబ్రమణి పర్యవేక్షించనున్నారు. వీటి ద్వారానే భారత త్రివిధ దళాల్లో సమన్వయం పెరుగుతుందని అంచనావేస్తున్నారు. జనరల్ రాజా సుబ్రమణి చైనా, పాకిస్థాన్ అంశాల్లో నిపుణుడిగా సైనిక వర్గాల్లో పేరుంది. ఆయన నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్‌కు మిలిటరీ అడ్వైజర్‌గా కూడా పనిచేశారు. వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీస్టాఫ్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. తాజా బాధ్యతల్లో ఆయన ఇంటిగ్రేటెడ్ మిలిటరీ కమాండ్స్ ఏర్పాటుతో.. థియేటరైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. మరోవైపు సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పదవీ కాలం శనివారంతో ముగిసింది.

**పూర్తి అంకితభావంతో దేశసేవ: రాజా సుబ్రమణి**


సీడీఎస్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జనరల్ రాజా సుబ్రమణి మీడియాతో మాట్లాడారు. "దేశ సార్వభౌమత్వం, జాతీయ ప్రయోజనాలు కాపాడటానికి సైనిక దళాలు పూర్తిగా కట్టుబడి ఉన్నాయన్నారు. దళాలు దేశ సేవ కోసం పూర్తి అంకితభావంతో పనిచేస్తాయని తాను హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

**నేవీ చీఫ్‌గా అడ్మిరల్ స్వామినాథన్ బాధ్యతల స్వీకరణ**

నేవీ చీఫ్‌గా అడ్మిరల్

మిగతా 2లో..

## పొలం దున్నిన మంత్రి నిమ్మల



**పాలకొల్లు, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు స్వగ్రామంలో వ్యవసాయ పనుల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం పాలకొల్లు నుంచి ఏడు కిలోమీటర్లు సైకిల్ తొక్కుకుంటూ అగర్తిపాలెనికి చేరుకున్నారు. దారి పొడవునా ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సొంత రొయ్యల చెరువులో మేత వేసి.. రొయ్యల ఎదుగుదలను పరిశీలించారు. అనంతరం తన పొలంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నారు. ఆదివారం సెలవు రోజున కొద్దిపాటి సమయం దొరకడంతో తనకు ఇష్టమైన వ్యవసాయ పనుల్లో పాల్గొన్నట్లు మంత్రి నిమ్మల చెప్పారు. సొంత వ్యవసాయ పనుల్లో కార్మికులతో కలిసి పనిచేయడం ఎంతో సంతృప్తిగా ఉంటుందన్నారు. షెడ్యూల్ ప్రకారం ఆదివారం గోదావరి డెల్టాకు సాగు నీరు విడుదల చేశామని చెప్పారు. రైతులందరూ ముందస్తుగా వరి నాట్లు వేసేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో సాగు నీటిని సక్రమంగా వినియోగించుకుంటూ జల సంరక్షణ చేపట్టాలని పిలుపునిచ్చారు.

## మేనల్లుడిపై దాడికి ఖండన..


ఆస్పత్రి సీఈవోకు మమత వార్నింగ్ ఆడియో లీక్..!



**కలకత్తా, మే 31:** తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై దాడి నేపథ్యంలో పశ్చిమబెంగాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ దాడిపై మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ క్రమంలో కోల్‌కతాలోని ఓ ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రి సీఈవోకు ఆమె వార్నింగ్ ఇస్తున్న ఆడియో బహిర్గతమైంది. ఇది కాస్త రాజకీయ దుమారం రేపింది. అభిషేక్ బెనర్జీపై సోనార్‌పుర్‌లో దాడి అనంతరం.. చికిత్స కోసం బెల్ వ్యూ ఆస్పత్రికి తరలించారు. అభిషేక్ పరిస్థితి తీవ్రంగా ఉన్నప్పటికీ.. డిశ్చార్జ్ చేయాలంటూ భాజపా నాయకులు, ఓ సీనియర్ పోలీసు అధికారి ఆస్పత్రిపై ఒత్తిడి తెచ్చారని మమత ఆరోపించారు. తన మేనల్లుడికి ఏమైనా జరిగితే ఆస్పత్రిదే బాధ్యత అని మండిపడ్డారు. ఈ క్రమంలో మమతా బెనర్జీ బెల్ వ్యూ ఆస్పత్రి సీఈవో ప్రదీప్ టాండన్‌ను హెచ్చరిస్తున్న ఆడియో బయటకు వచ్చింది. 'టాండన్ మీరు తప్పుచేశారు. మేము మీకు చేసిన సాయాన్ని గుర్తుచేసుకోండి. దేవుడు మిమ్మల్ని క్షమించడు. మీ అహంకారాన్ని గుర్తుంచుకుంటాం. మీరు తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆస్పత్రిని

మిగతా 2లో..

## ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి అక్రమంగా టెలికామ్ సంకేతాలు: పాక్ దుశ్చర్య



**న్యూఢిల్లీ, మే 31:** ఉగ్రవాద పోషణలో పాక్ వంకర బుద్ధి మారడంలేదు. జమ్మూ కశ్మీర్‌లోని ఉగ్ర నెట్‌వర్క్‌ల కోసం అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ నిబంధనల ఉల్లంఘనలకు కూడా పాల్పడుతోంది. ఇందుకోసం సరిహద్దుల వెంట భారత్ వైపు అక్రమంగా సెల్యూలర్ సంకేతాలను పంపిస్తోంది. ఇది ఉగ్రవాదుల రహస్య కమ్యూనికేషన్లకూ ఊపిరిగా ఉపయోగ పడుతోందని అధికారులు వెల్లడించారు. ఇటీవల పాకిస్థాన్ చర్యలు అధికారుల అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ పీర్ పంజాల్ పర్వతశ్రేణుల్లో చొరబాట్లు పెరుగుతున్నాయి. దీనికి తోడు నియంత్రణ రేఖకు అటువైపు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్ల సంకేతాలు కరుడు గట్టిన ఉగ్రవాదులున్న జైళ్లకు చేరుతున్నాయి. కశ్మీర్‌లోని పర్వతశ్రేణులు సహజంగా చాలా వరకు సంకేతాలను అడ్డుకొంటున్నా.. మైదాన ప్రాంతం ఉన్న జమ్మూలో మాత్రం ఈ సంకేతాలు భారత్‌లోకి చొరబడి ఉగ్రనెట్‌వర్క్‌లకు చేరుతున్నాయి. ముఖ్యంగా కతువా, రాజౌరీ, పూంచ్ జిల్లాలు, జమ్మూలోని కోట్ బల్వాల్ జైలు వంటి ప్రదేశాల వద్ద పాక్ టెలికామ్ సిగ్నల్స్‌ను మన దళాలు గుర్తించాయి. కొన్ని జైళ్లలో ఇప్పటికే జామర్లను ఏర్పాటు చేసినా వీటిని అడ్డుకోవడంలో విఫలం అవుతున్నాయి. అక్రమంగా కారాగారాల్లోకి చేరిన ఫోన్లను ఖైదీలు వినియోగిస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 14 జైళ్లు, రెండు కరెక్షన్ హోమ్‌లు ఉన్నాయి. పాకిస్థాన్

మిగతా 2లో..

## ఫిన్‌టెక్ రంగంలోకి ఎల్ఐసీ

సీఈఓ దొరైస్వామి




**న్యూఢిల్లీ, మే 31:** ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఫిన్‌టెక్ రంగంలోకి ప్రవేశించాలనుకుంటోంది. డిజిటల్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యూహాత్మక పెట్టుబడులు లేదా ఆర్గానిక్ మార్గంలో ఫిన్‌టెక్ విభాగాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కంపెనీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి తెలిపారు. ఆధునిక అవసరాలను తీర్చడానికి, నూతన ఆవిష్కరణల కోసం అటు ఫిన్‌టెక్, ఇటు ఇన్సురెన్స్‌టెక్ కంపెనీలతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు పీఐటీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశలపై మాట్లాడారు. కేవలం బీమా వ్యాపారమే కాకుండా దేశంలోనే అతిపెద్ద ఆర్థిక సంస్థగా ఎల్ఐసీ ఉందని, అనేక

మిగతా 2లో..

దానాన్ని మించిన దొడ్డగుణం ఏదీలేదు. మానవుడు ఎంత గొప్పవాడైతే, అంత కఠినమైన పరీక్షలను ఎదుర్కొనవలసి ఉంటుంది. సత్యాన్ని త్రికరణశుద్ధిగా నమ్మితే విజయం తథ్యం.


## నేటి మనదేశమ్ సంపాదకీయం

# జనాభా కాదు..మౌళిక వసతులు ఆలోచించండి !

దేశంలో ప్రస్తుతం ఉన్న జనాభాకే సరైన మౌళిక సదుపయాలు లేవు. విద్య,వైద్యం అందించే స్థితిలో ప్రభుత్వాలు లేవు. అలాగే నిత్యావసరాలు అందడం లేదు. ఉండడానికి ఇల్లు లేదు. దేశంలో అత్యధిక జనాభాకు కనీస గూడు కూడా కరువే. ఘనత వహించిన పాలకుల తీరు కారణంగా ప్రజలు నానా అగచాట్లు పడుతున్నా పాలకులకు పట్టింపు లేదు. ధాన్యం దిగుబడులు పెరుగుతున్నా, వాటిని సకాలంలో సేకరించే యంత్రాంగం లేదు. ఉన్న జనాభాను పనులకు ఉపయోగించుకునే తెలివి లేకుండా పోయింది. ఇదంతా కూడా కేవలం వ్యవస్థాగత లోపంతో పాటు, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం, పరిపాలనానుభం లేకపోవడం ప్రధాన కారణంగా చూడాలి. ఇలాంటి సమయంలో ఈ మధ్య ఎపి సిఎం చంద్రబాబు పిల్లలను కనండి.. డబ్బులు పడేస్తాను అంటూ ప్రచారంతో ఊదరగొడుతున్నారు. తను ఒక్క కొడుకునే కన్నాడు. తన కొడుకు లోకేశ్ కూడా ఒక్క పిల్లాడిని కని మిన్నకున్నారు. చంద్రబాబు పిలుపు ఇంటికి పనికిరాదా అన్నది చెప్పాలి. కనీస మౌళిక వసతులు కల్పించేందుకు చంద్రబాబు పనిచేస్తున్నారా అన్నది చెప్పాలి. ఇవేవీ కల్పించ కుండా పిల్లలను కని పడేసతే వారికి తిండి,బట్ట, చదువుసంధ్యా, వైద్యం ఎవరు అందిస్తారో చెప్పాలి. ఇందుకు గ్యారెంటీ ఇవ్వగలరా అన్నది చెప్పాలి. ఇప్పుడున్న పిల్లలకు ఈ రకమైన వసతులు కల్పించడానికి ఏం చేస్తున్నారో చంద్రబాబుతో సహా పాలకులంతా ప్రకటించాలి. దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకుని వెళ్లే బదులు ఇలా తిరోగమనం వైపు తీసుకుని వెళ్లే యత్నంలో రాజకీయ కోణం తప్ప మరోటి లేదు. జనాభా నియంత్రణ లేకపోవడంతో దేశంపై ఎంతగా భారం పడుఉతందో చెప్పడం లేదు. ప్రజలు త్యాగాలు చేస్తుంటే... నాయకులు భోగాలు అనుభవిస్తున్నారు. కేవలం సీట్లు పెంచుకోవడం అన్న ధ్యాస తప్ప మరోటి లేదు. జనాభా పెరిగితే రేపటి అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లలో కోత ఉండదన్న దురుద్దేశం ఇందులో దాగి ఉందనడంలో సందేహం లేదు. దక్షిణాది రాష్ట్రాల జనాభా పెరుగుదల రేటు గణనీయంగా తగ్గిన కారణంగా నియోజక వర్గాల పునర్విభజన జరిగితే, నష్టపోతాం కనుక జనాభాను పెంచాల్సి ఉందని,అందుకు మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలని చంద్రబాబు నాయుడు సెలవిచ్చారు. ఎక్కడకు వెళ్లినా , కార్యక్రమం ఏదైనా జనాభా పెంచాల్సిన అవసరాన్ని నొక్కి చబుతున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ మంది పిల్లలను కనే మహిళలకు, పిల్లలకు ప్రోత్సాహకాలను కూడా ప్రకటించారు. మూడవ సంతానానికి రూ.30 వేలు, నాల్గవ సంతానానికి రూ.40 వేలు నగదు సహాయం చేస్తామని, ఆర్థికాభివృద్ధి బాగుంటే మరింత ఎక్కువ ఇవ్వడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. అసలు ఈ పిల్లలను కనడానికి కనీసం ఆస్పత్రి సౌకర్యాలు లేని ఎన్నో గ్రామాలు ఉన్నాయి. ముందుగా ఆయా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా రావడం లేదు. ఎవరి ప్రయోజనాల కోసం మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలో చెప్పాలి. పిల్లను కనడం వల్ల వచ్చే సౌలభ్యం ఏమిటో చెప్పాలి. ఈ ప్రోత్సాహకాలు ప్రకటించడం ద్వారా గ్రామీణ మహిళల కుటుంబాల్లో డబ్బు కోసం ఒత్తిడి పెరుగుతోంది. ఈ విషయం చంద్రబాబు గ్రహించినట్లు లేదు.ప్రోత్సాహకాలు మాత్రమే మహిళలు ఆరోగ్యంగా, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి, పిల్లలు సురక్షితమైన వాతావరణంలో పెరగడానికి అవకాశాలు కల్పిస్తాయని భరోసా ఇవ్వగలరా అన్నది చెప్పాలి. కార్పొరేట్ సంస్థలకు చౌకగా శ్రామికులను సరఫరా చేయడానికి, మహిళలను ఇంటికి పరిమితం చేయడానికి మాత్రమే ఇది ఉపయోగ పడుతుంది. దేశ జనాభా ఇప్పటికే విపరీతంగా పెరిగింది. బాల్యం అంతా వెట్టిలో సాగుతోంది. జనాభా పెరుగుదల దేశంలో అసమానతలను పెంచింది. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అభద్రత, హింస, అత్యాచారాలు, అశాంతి పెరిగినట్లుగా అన్ని గణాంకాలు, నివేదికలు తెలియచేస్తున్నాయి. మహిళల విద్య, ఉపాధి, పౌష్టికతకు సంబంధించిన అంశాలలో వెనకబడుతున్నాం. ఇటువంటి దుర్భర పరిస్థితులలో ఎక్కువ మంది పిల్లల్ని కనండి అని సూచించడం ద్వారా గ్రామీణ కుటుంబాల్లో భారం మోపడం తప్ప మరోటి కాదు. పిల్లను కనడానికి సరైన ఆస్పత్రులు లేవు. పెంచడానికి సరైన భద్రత లేదు. పెంచిన తరవాత చదివించేం దుకు సరైన పాఠశాలలు లేవు. వారిని సమర్థులైన పౌరులుగా తీర్చిదిద్దడానికి అనువైన వాతావరణం లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే మహిళలు పిల్లల్ని కనే క్రమంలో శారీరక, మానసిక మార్పులు, ఒత్తిళ్లకు లోనుకావాల్సి ఉంటుంది. వాటిని అధిగమించడానికి అవసరమైన వైద్యం ఎక్కువ శాతం మహిళలకు అందుబాటులో లేదు. మరీ ముఖ్యంగా గ్రామీణ, గిరిజన మహిళలకు ఇలాంటి సమస్య ఎక్కువ. డోలీ లేకుండా గర్భిణిని తరలించే సౌకర్యం కల్పించని పాలకులు ఇఇ గుర్తుకు రావడం లేదు. సమాజంలో మార్పులు వస్తున్నా, ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగినా ఇంకా మహిళలు అణచివేతకు గురవుతున్నారు. 21 ఏళ్లు నిండినప్పటి నుంచి మహిళల మీదపెళ్లి ఒత్తడి పెరుగుతంది. పెళ్లి అయితే పిల్లలను కనమని ఒత్తిడి కుటుంబ సభ్యుల నుంచి ఉంటుంది. ఇక ప్రోత్సాహకాలు ఇస్తున్నారంటే ఆ ఒత్తిడి మరింత తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికే చాలా మంది మహిళలు కెరీర్, కుటుంబం రెండింటిని బ్యాలెన్స్ చేసుకోవడంలో అనేక ఒత్తిళ్లకు గురవుతున్నారు. వెనకటికి లాగా ఉమ్మడి కుటుంబాలు లేవు. నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలు అందరికీ అందుబాటులో ప్రభుత్వ అజమాయిషీలో తీసుకుని రావడంపై ముందుగా పాలకలు దృష్టి సారించాలి. ఇస్తామన్న ప్రోత్సాహక డబ్బు ఇందుకోసం వెచ్చించాలి. అందరూ ఉపాధిని హక్కుగా పొందగలిగేలా పరిస్తితిని సృష్టించాలి. స్కూళ్లతో పాటు ఆటస్థలాలు, పార్కులు, సాంస్కృతిక వికాసం కోసం లైబ్రరీలు, పాటలు, డాన్సులు నేర్పే సంస్థలను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. అప్పుడు జనాభా నియంత్రణను ఎవ్వరు కూడా పాటించరు.

# ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియపై లోపాలు పరిశీలిస్తున్నాం: సీబీఎస్ఈ

**న్యూఢిల్లీ, మే 31:** ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియపై వివాదం నేపథ్యంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఎట్టకేలకు మౌనం వీడింది. ఈ పోర్టల్‌లో వెలుగు చూస్తున్న



లోపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొంది. ఈ వ్యవస్థను పటిష్టం చేయడానికి సైబర్ సెక్యూరిటీ నిపుణుల బృందం కొన్ని రోజులుగా పనిచేస్తోందని, ఇప్పటివరకు గుర్తించిన సమస్యలను సరిచేసిందని తెలిపింది. "ఆన్‌మార్క్ పోర్టల్‌లో వెలుగు చూస్తోన్న లోపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ఈ వ్యవస్థలను పటిష్టం చేయడానికి గత కొన్ని రోజులుగా ఐఐటీలు, వివిధ ప్రభుత్వ విభాగాలతో కూడిన సైబర్ సెక్యూరిటీ నిపుణులు ప్రయత్నిస్తున్నారు. వ్యవస్థను మరింత సురక్షితంగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే గుర్తించిన లోపాలను సరిచేశారు. ఇంకా ఏమైనా లోపాలు ఉన్నాయా? అనేది పరిశీలిస్తూ కట్టడి చేసే పనిలో ఉన్నారు. ఈ వ్యవహారంలో అప్రమత్తంగా ఉంటూ లోపాలను ఎత్తిచూపుతున్న పౌరులు, ఎథికల్ హ్యాకర్లందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. వారిలో కొందరిని సంప్రదించాం. మరేదైనా సమాచారం ఉంటే సైబర్ భద్రతా విభాగాన్ని సంప్రదించవచ్చు" అని ఎక్స్ వేదికగా సీబీఎస్ఈ సూచించింది.

# జిందాల్ తరహాలో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు

### సాంకేతికతతో సాధ్యాసాధ్యాలను పరిశీలించండి... గోదావరి కాలుష్యాన్ని తొలగించేందుకు యత్నం

### పల్నాడులో పర్యటించి జిందాల్ ప్లాంట్‌ను పరిశీలించిన పవన్



**పల్నాడు, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిందాల్ పరిశ్రమ తరహాలోనే గోదావరి నదీ కాలుష్యాన్ని అరికట్టేందుకు సాంకేతికతను ఎలా అనుసంధానం చేయవచ్చో పరిశీలించాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో చెత్తను వేరు చేసి, దాన్ని విద్యుత్ తయారీకి ఉపయోగించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో రోజూ ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను సద్వినియోగం చేసుకునేలా మరిన్ని 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్ల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పల్నాడు జిల్లా కొండవీడు పరిధిలోని జిందాల్ 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్‌ను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సందర్శించారు.

ఈ సందర్భంగా ప్లాంట్‌లో చెత్తను సేకరించడం దగ్గర నుంచి బాయిలర్‌లో అది బూడిదగా మారే వరకూ.. ప్రక్రియను ఆసక్తిగా పరిశీలించారు. చెత్త నుంచి విద్యుత్ తయారీ విధానంపై ప్లాంట్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా అధికారులు, ఎ÷-లాంట్ నిర్వాహకులకు ఉప ముఖ్యమంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా పేరొందిన 'ఇండోర్ మోడల్' తరహాలో చెత్తను పద్ధతిగా, పారదర్శకంగా వేరు చేసేలా కొత్త మార్గదర్శకాలను రూపొందించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మరోవైపు.. ప్లాంట్ అధికారులు ఉప ముఖ్యమంత్రికి అంతర్జాతీయ, జాతీయ స్థాయి గణాంకాలను వివరించారు. సింగపూర్‌లో మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 2.8 శాతం కేవలం ఇలాంటి చెత్త ప్లాంట్ల నుంచే లభిస్తోందని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ గ్రిడ్‌తో ఈ వ్యర్థ ఆధారిత విద్యుత్ ప్లాంట్ల అనుసంధానం చాలా అద్భుతంగా ఉందని అధికారులు ప్రశంసించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సరఫరా వృథా శాతం అత్యంత తక్కువగా ఉండటం విశేషమని డిప్యూటీ సీఎంకు ఈ సందర్భంగా అధికారులు తెలియజేశారు.

# అవసరమైతే ఆపరేషనక సిందూర్-2

### పాక్‌ను మరోమారు హెచ్చరించిన ఆర్మీ చీఫ్

**పుణె,మే31(ఆర్ఎన్ఎ):** పాకిస్థాన్‌కు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది గట్టి హెచ్చరిక చేశారు. అవసరమైతే ఆపరేషన్ సిందూర్ 2.0కు భారత సైనిక బలగాలు సర్వ సన్నద్ధంగా ఉన్నాయని చెప్పారు. భూమి, ఆకాశం, సముద్రంలో అత్యాధునిక రీతుల్లో పోరాటానికి త్రివిద దళాలు సామర్థ్యం పెంచుకుంటున్నట్టు తెలిపారు. పుణెలో శనివారంనాడు జరిగిన నేషనల్ డిఫెన్స్ అకాడమి 150వ పాసింగ్ ఔట్ పరేడ్ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. శాంతి తాత్కాలికమేనని, అవసరమైతే ఆపరేషన్ సింధూర్ సెకెండ్ ఫేజ్‌కు కూడా త్రివిధ దళాలు పట్టుదలగా సర్వసన్నద్ధమవుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో జరుగబోయే యుద్ధాలు కేవలం భూమి, సుముద్రం, ఆకాశానికే పరిమితం కావని ద్వివేది అన్నారు. స్పేస్, సైబర్, కాగ్నిటివ్ డొమెయిన్లలోనూ యుద్ధ ప్రభావం ఉంటుందన్నారు. మోహరింపులు, ప్రొటక్షన్ చర్యలపై మిలటరీ వ్యూహకర్తలు అత్యంత అప్రత్తంగా ఉండాలని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ తన సత్తా చాటిందని, సైనకదళాలు కచ్చితత్వంలో దాడి చేయగలవని నిరూపించాయని చెప్పారు. భవిష్యత్ యుద్ధాల విషయంలోనూ ప్రజావిశ్వాసం, జాతీయ సమకృత కీలకాంశాలుగా ఉంటాయన్నారు. త దశాబ్ద కాలంగా బలగాల సామర్థ్యంలో అద్భుతమైన పరివర్తన చోటుచేసుకుంటోందని, ఇందులో యువత భాగస్వామ్యం కీలకంగా ఉందని అన్నారు. ఈ మార్పుల్లో భాగంగా డ్రోన్ బెటాలియన్లు, దివ్యాస్త్ర బ్యాటరీలు, శక్తిమాన్ రెజిమెంట్లు, భైరవ్ బెటాలియన్లు, ఇతర టెక్నాలజీ ఆధారిత సైన్యాన్ని రూపొందిస్తున్నట్టు చెప్పారు. నెట్‌వర్గింగ్, డాటా-సెంట్రిసిటీ కీలకమైన వ్యూహాత్మక వనరులు కాబోతోందని అన్నారు. డ్రోన్ల వినియోగంపై అన్ని అకాడమిల్లో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

# విజయవాడ హైవేపై బస్సు దగ్ధం

### - తృటిలో తప్పిన పెద్ద ప్రమాదం - బస్సులో ఉన్న ప్రయాణికులు సురక్షితం

**నల్లగొండ, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్-విజయవాడ హైవేపై మరో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో శనివారం తెల్లవారుజామున ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతైంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న రెయిన్‌బో ట్రావెల్స్‌కు చెందిన బస్సులో మంటలు చెలరేగగా.. ప్రమాద సమయంలో 36 మంది ప్రయాణికులు బస్సులో ఉండగా.. అందరూ సురక్షితంగా బయటపడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రయాణ మధ్యలో బస్సు ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పరిస్థితిని వెంటనే గుర్తించిన డ్రైవర్ అప్రమత్తమై బస్సును రోడ్డుపక్కన నిలిపివేసి ప్రయాణికులను వెంటనే దిగిపోవాలని హెచ్చరించాడు. దీంతో ప్రయాణికులంతా సురక్షితంగా బయటకు వచ్చారు. అయితే కొద్దిసేపటికే మంటలు బస్సు అంతటా వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే బస్సు పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరట కలిగించింది. బస్సులో మంటలు చెలరేగడానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.

# టిడిపి మహిళా రిజర్వేషన్లపై చర్చ

### అన్ని పార్టీలు అనుసరించక తప్పనిస్థితి

### ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక వ్యాఖ్యలు



**అమరావతి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ని టీడీపీ ప్రకటించడం దేశ రాజకీయాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారిందన్నారు. మహిళా రిజర్వేషన్లను అన్ని పార్టీలు స్వాగతించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. మొదటి నుంచీ మహిళలకు టీడీపీ అండగా ఉందని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. డీలిమిటేషన్ విషయంలో 2011 జనాభా లెక్కలైనా, తాజా లెక్కలైనా మనకు నష్టం కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అందుకే ఉన్న స్థానాలను 50 శాతం పెంచితే అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. పెంచిన స్థానాలను మహిళలకు కేటాయించవచ్చని అభిప్రాయపడ్డారు. దీంతో గతంలో ఈ బిల్లును వ్యతిరేకించిన వారి ఆలోచన కూడా మారవచ్చని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లుల విషయంలో కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉందన్నారు. రెండు బిల్లులను తీసుకురావడానికి కేంద్రం సిద్ధమవుతోందని, ఆ రెండింటినీ విడదీసి చూడాల్సిన అవసరం ఏముందని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. రెండు బిల్లులు కలిపి వస్తేనే మహిళలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్, పునర్విభజన బిల్లులు తప్పనిసరిగా తీసుకురావాలని, ఇవి దేశ రాజకీయాల్లో పెను మార్పులు తీసుకొస్తాయని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అరుదైన ఘనత

### దేశంలోనే తొలిసారిగా పిఎం-సేతు పథకం అమలు

**అమరావతి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అరుదైన ఘనత లభించింది. దేశంలోనే తొలిసారిగా పిఎం-సేతు పథకం అమలు చేయనున్న రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ఈ మేరకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ స్టీరింగ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్‌కు సంబంధించిన 'స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్'కు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో విశాఖ ఐటీఐల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ప్రముఖ ఉక్కు దిగ్గజం ఆర్సెలార్ మిట్టల్ భాగస్వామ్యంతో ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. జాతీయ స్థాయిలో రూ.60,000 కోట్ల బ్జడెట్‌తో చేపడుతున్న ఈ కార్యక్రమంలో మొదటి దశలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజ వేసింది. విశాఖ ఐటీఐల అభివృద్ధికి అకడమిక్ భాగస్వామిగా ఔంట÷ఇఅఊ సంస్థ కూడా రంగంలోకి దిగింది. ఈ ప్రాజెక్టులో 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌ను అమలు చేయనున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఐటీఐ విద్యార్థులకు ఆధునిక సాంకేతిక శిక్షణ అందించడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. కోర్సు పూర్తి చేసిన వెంటనే విద్యార్థులకు నేరుగా పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే పిఎం సేతు లక్ష్యంగా కేంద్రం పేర్కొంది. 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో భాగంగా ప్రభుత్వ ఐటీఐలను బలోపేతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఏపీ బాటలోనే నడవడానికి మరో 12 రాష్ట్రాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. పరిశ్రమల భాగస్వామ్యానికి వేగంగా టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని కేంద్ర వర్గాలు వెల్లడించాయి.

# మంత్రాలయం వద్ద విషాద ఘటన

### తుంగభద్రలో మునిగి ఐదుగురు గల్లంతు

**కర్నూలు, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మంత్రాలయం వద్ద విషాదం చోటుచేసుకుంది. తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లిన ఐదుగురు గల్లంతయ్యారు. హైదరాబాద్‌కు చెందిన యువన్ చంద్ర (5), సతీష్ (35), మంత్రాలయంకు చెందిన రాఘవేంద్ర (25), ధను (23), ఉరవకొండకు చెందిన సంధ్య (22) నదిలో గల్లంతైన వారిలో ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రాలయంలోని ఓ ఇంట్లో జరిగిన సత్యనారాయణ స్వామి పూజకు హాజరైన బంధువులు, పూజ అనంతరం సమీపంలోని తుంగభద్ర నదికి వెళ్లి ఈతకు దిగినట్లు సమాచారం. నీటి లోతు అంచనా వేయకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని తెలుస్తోంది.

## మొదటి పేజీ తరువాయి

# ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల

ఆయన సాగునీరు విడుదల చేశారు. మంత్రి దుర్గేష్‌తో పాటు కూటమి ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. గోదావరికి జలహారతి ఇచ్చి.. మీట నొక్కి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టా కాలువకు నీటి విడుదలతో తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి అక్రమంగా టెలికామ్ సంకేతాలు: పాక్ దుశ్చర్య

టవర్లు చైనాకు చెందిన సీడీఎంఏ టెక్నాలజీని వినియోగిస్తున్నాయి. వీటిల్లో అత్యున్నత స్థాయి ఎన్‌క్రిప్షన్ సాధ్యమవుతుంది. ఇది ఉగ్రవాదులు వాడే వైఎస్ఎంఎస్‌కు ఉపయోగపడుతుంది. సీడీఎంఏ పలు సిగ్నల్స్‌ను ఏకకాలంలో అనుమతిస్తుంది. దీంతో భద్రతా ఏజెన్సీల ఎలక్ట్రానిక్ మానిటరింగ్ సమస్యాత్మకంగా మారుతుంది. దీంతో ఉగ్రవాదులు వైఎస్ఎంఎస్ టెక్నాలజీని విరివిగా వాడుతున్నారు. దీంతో పాక్ పంపే సిగ్నల్స్‌తో పీవోకేలోని హ్యాండ్లర్లు, చొరబాటుదారులు, వారికి ఆశ్రయం ఇచ్చే వారితో నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. ఈ అక్రమ విధానాలతో పాకిస్థాన్ ఐరాస అంతర్జాతీయ టెలికమ్యూ నికేషన్ యూనియన్ రాజ్యాంగంలోని 45 ఆర్టికల్‌ను ఉల్లంఘిస్తోందని అధికారులు వెల్లడించారు. ఈ ఆర్టికల్ ప్రకారం ఒప్పందంపై సంతకాలు చేసిన మొత్తం 193 దేశాలు తమ భూభాగం నుంచి అధిక, రోగ్, తప్పుడు, తప్పుదోవ పట్టించే సంకేతాలు పక్కదేశాల్లోకి వెళ్లకుండా సహకరించుకోవాలి.

# మేనల్లుడిపై దాడికి ఖండన..

నడుపుతున్నారు. ఇప్పుడు భాజపా అధికారంలో ఉంది. తర్వాత వాళ్లు అధికారం కోల్పోతే.. మేం చేయాల్సింది చేస్తాం' అని ఆమె పేర్కొన్నట్లు అందులో ఉంది. ప్రస్తుతం అభిషేక్ బెనర్జీకి ఇంట్లోనే చికిత్స అందిస్తున్నట్లు మమత తెలిపారు. కాగా.. ఈ దాడికి సంబంధించి పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు.

# ఫిన్‌టెక్ రంగంలోకి ఎల్ఐసీ

పెద్ద పెద్ద కంపెనీల్లో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిందన్నారు. పాలసీదారులకు మెరుగైన ప్రతిఫలం అందించేందుకు ప్రత్యేకమైన సంస్థల్లో వ్యూహాత్మక పెట్టుబడులకూ ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. డిజిటల్ టెక్నాలజీని ఎల్ఐసీ వేగంగా అందిపుచ్చుకుంటోందని చెప్పారు. తమ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా సొంతంగానే తమ బిజినెస్ అప్లికేషన్లను తయారు చేసుకుంటున్నామని వెల్లడించారు. అదే సమయంలో కొత్త కొత్త ప్లాట్‌ఫామ్‌లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఇతర ఐటీ సర్వీస్ ప్రొవైడర్లతోనూ కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఫిన్‌టెక్ రంగంలో పోటీలో నిలదొక్కుకోవాలంటే ఐటీ అప్లికేషన్‌లను ఆధునీకీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ఐసీలో తదుపరి వాటాల విక్రయంపై ప్రశ్నించగా.. పబ్లిక్ షేర్‌హోల్డింగ్ పరిమితిని పెంచేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు.

# సాయుధ దళాల వ్యవస్థీకృత సంస్కరణలపైనే దృష్టి

స్వామినాథన్ ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈ స్థానంలో ఉన్న డీకే త్రిపాఠీ పదవీకాలం శనివారంతో ముగిసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు స్వామినాథన్ వెస్ట్రన్ నేవల్ కమాండ్‌కు ఫ్లాగ్ ఆఫీసర్ కమాండ్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహించారు. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు పూర్తిగా కట్టుబడి ఉంటానని ఈ సందర్భంగా కొత్త నేవీ చీఫ్ వెల్లడించారు.

## మజ్జిగతో దాహార్తి తీర్చిన గాదంకి టోల్ ప్లాజా సిబ్బంది..!

**చంద్రగిరి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వేసవి తపంతో విలవిలలాడుతున్న ప్రయాణికులకు గాదంకి టోల్ ప్లాజా యాజమాన్యం చల్లని మజ్జిగను అందజేసి దాహార్తి తీర్చుతున్నారు.చిత్తూరు–మల్లవరం ప్రాజెక్ట్" నేషనల్ హైవే ఇన్ ఫ్రా ట్రస్ట్" సదరన్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్"(ఎన్ హెచ్ ఐ టి ఎన్ ఎస్ పి పిఎల్) ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా ప్రయాణికులకు మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. సామాజిక సేవ లందించడంలో " ఎన్ హెచ్ ఐ టి ఎన్ ఎస్ పి పి ఎల్ " ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలుస్తున్న నేపథ్యంలో ద్విచక్ర వాహన చోదకులకు, ఆటో డ్రైవర్లకు, తిరుమలకు కాలినడకన వస్తున్న భక్తులకు వేసవి తాపం నుండి ఉపశమనం కల్పించేందుకు మజ్జిగను పంపిణీ చూస్తున్నారు. దీంతో ప్రయాణికులు వీరి సేవలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గాదంకి టోల్ ప్లాజా మేనేజర్ సెందిల్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన కూరపాటి శంకర్ రెడ్డి

**సత్యవేడు, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు ఆపత్కాలంలో తాను ఉన్నానంటూ అండగా నిలుస్తున్న నియోజకవర్గ టిడిపి ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి.సత్యవేడు నియోకవర్గానికి చెందిన 11 మంది అత్యవసర పరిస్థితుల్లో శస్త్ర చికిత్సలు చేసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వచ్చిన చెక్కులను అందజేశారు.తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు గారి ఆదేశాలతో సత్యవేడు నియోజకవర్గంలో ఏ ఒక్కరికి సమస్య వచ్చినా తమ వంతు బాధ్యతగా సాయం చేయడానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని అన్నారు. ఇందులో భాగంగా కేవీబీపురం,నాగలాపురం పిచ్చాటూరు, వరదయ్యపాలెం, బిన్ కండ్రిగ మండలాలకు చెందిన 11 మందికి 6లక్షల 85వేల 288 రూపాయలు విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను లబ్ధిదారులకు శంకర్ రెడ్డి అందచేశారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**తొట్టంబేడు,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తొట్టంబేడు మండలం పెద్ద కన్నలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1983–84 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆదివారం పాఠశాల ఆవరణంలో 1983–84 విద్యా సంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సవం నడుమ జరుపుకున్నారు. సుమారు 42 ఏళ్ళు అనంతరం ఒకే వేదికపై బాల్య స్నేహితులు కలుసుకుని తమ పాఠశాల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ప్రత్యేక సమావేశంలో దివంగత ఉపాధ్యాయులు, సహ విద్యార్థుల స్మారకార్థం మౌన నివాళి అర్పించారు. పూర్వ విద్యార్థుల తరఫున స్వాగత ప్రసంగం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి గురువులు ధనలక్ష్మి, చంద్రయ్య , గౌస్ మాస్టర్, కృష్ణమ నాయుడు ల ను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహుకరించారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయురాలు లత ను సత్కరించారు. గురు శిష్యుల బంధం ఎనలేనిది అని, బాల స్నేహం విడదీయరాని మధురానుభూతిని పలువురన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు.

## సీటీఎం చెరువులో పడి వ్యక్తి గల్లంతు

### -మృతదేహం వెలికితీసిన అగ్నిమాపక సిబ్బంది

**మదనపల్లె,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బట్టలు ఉతకడానికి వెళ్లి చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మదనపల్లె మండలంలో విషాదం నింపింది.అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం, సీటీఎం కొత్తపేటకు చెందిన బాలాజీ (45) ఆదివారం చిన్నతిప్పసముద్రం చెరువుకు బట్టలు ఉతకడానికి వెళ్లాడు. ఈ క్రమంలో పొర పాటున లోతైన నీటిలో పడి మునిగి పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో స్థానికులు తాలూకా పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక అధికారి శివప్ప ఫైర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చెరువులో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం బాలాజీ మృత దేహాన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలాజీ మృతితో సీటీఎం కొత్తపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటోను తప్పించబోయి చెట్టును ఢీకొట్టిన కారు

### - ఒకరికి తీవ్ర గాయాలు

**రామసముద్రం,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామసముద్రం మండలం మినికి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే ప్రయత్నంలో కారు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చింతచెట్టు మొదలను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద సమయంలో కారులో నలుగురు ప్రయాణిస్తుండగా పెద్దపంజాణి మండలం ముత్తుకూరుకు చెందిన వేణు(50) తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా, మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చి క్షతగాత్రులను పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వారంతా ముత్తుకూరు గ్రామానికి చెందిన వారేనని తెలిసింది. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## హార్స్లీ హిల్స్‌లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

### - ప్రత్యేక తనిఖీల్లో భారీగా జరిమానాలు -వాహనాల సీజ్

### - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ హెచ్చరిక

**మదనపల్లె / బి. కొత్తకోట/ మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రముఖ పర్యాటక కేంద్రం హార్స్లీ హిల్స్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారిపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు.హార్స్లీ హిల్స్ ఘాట్ రోడ్డులో కొందరు యువకులు అతివేగంగా, నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాలు నడపడం, ఒకే బైక్‌పై ముగ్గురు, నలుగురు ప్రయాణించడం, మోడిఫైడ్ సైలెన్సర్లతో శబ్ద కాలుష్యం సృష్టించడం, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి చర్యలతో తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెడుతున్నారని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో ఆదివారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించగా, కేవలం రెండు గంటల వ్యవధిలోనే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై కేసులు నమోదు చేసి రూ.52 వేల జరిమానాలు వసూలు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 13 వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు పలువాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు.హార్స్లీ హిల్స్‌లో పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇకపై నిరంతరాయంగా ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు మరింత కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. పర్యాటకులు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు.”నిబంధనలు పాటించడం బాధ్యత... ఉల్లంఘించడం ప్రమాదం. హార్స్లీ హిల్స్‌లో నిర్లక్ష్య డ్రైవింగ్‌ను ఏమాత్రం సహించం” అని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పేర్నాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**సూళ్లూరుపేట,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పేర్నాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్పిటల్ లోని సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా లేదా, హాస్పిటల్లో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్లో ఉన్న రోగులకు వైద్యం ఏ విధంగా అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ కి వచ్చే ప్రజలతో ప్రేమగా మెలగాలని, రోగులకు డాక్టర్లు ఇచ్చే ధైర్యంతోనే సగం జబ్బు నయమవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. హాస్పిటల్ నందు ఉన్న మందులను జాగ్రత్తగా పరిశీలించి హాస్పిటల్ సిబ్బందికి తగు సూచనలు చేశారు.

## ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

**నంద్యాల, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఆర్. వెంకటరమణ ఆధ్వర్యంలో నంద్యాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీల కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవరాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.ధూమపానం, పొగాకు వినియోగం ఆరోగ్యాన్ని నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని ఆయన పేర్కొన్నారు. పొగాకు వాడకం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. సిగరెట్లు, బీడీలలో వేలాది హానికర రసాయనాలు ఉండటం వల్ల ప్రతి సంవత్సరం లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు.పరోక్ష ధూమపానం కూడా కుటుంబ సభ్యులు, చిన్నారులు మరియు చుట్టుపక్కల వారిపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు. పొగాకు అలవాటు వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితిని కూడా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు.ధూమపానం నివారణకు పాఠశాలలు, కళాశాలలు, ప్రజా మాధ్యమాల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పబ్లిక్ ప్రదేశాల్లో ధూమపాన నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు పొగాకు ఉత్పత్తుల ప్రచారాన్ని నిరోధించాలని కోరారు.

## వదలడం సులభం.. వెతకడమే సంకటం

**శ్రీకాళహస్తి,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం మూడు ప్రవేశ ద్వారాల వద్ద పాదరక్షలు భద్ర పరచుకునే ఉచిత కౌంటర్లు అందుబాటులో ఉన్నాయి. కేంద్రీయ అర్జిత సేవా కౌంటర్ వద్ద అనధికారికంగా ఇబ్బడి ముబ్బడిగా పాదరక్షలు వదిలిపెట్టడం మళ్లీ వాటికోసం గంటల తరబడి వెతుకులాడటం భక్తుల పాలిట శిక్షగా మారింది. పాదరక్షలు ఎక్కడ పడితే అక్కడ కాకుండా కౌంటర్లలో భద్రపరుచుకునే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

## రాహు కాలం.. సర్వత్రా సంకటం



**శ్రీకాళహస్తి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఓవైపు క్యూలైన్ల నిండా భక్తులు.. మరోవైపు సర్వర్ మొరాయించి స్తంభించిన ఆన్ లైన్ యంత్రాలు.. ఫలితంగా రాహుకాలం పూర్తవుతుందన్న హడావుడితో భక్తులకు అవస్థలు తప్పలేదు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో రూ 1500, రూ 2,500, రూ 5 వేల విలువైన రాహు కేతు పూజలతో పాటు శీఘ్ర దర్శనం, అంతరాలయ దర్శనాల టికెట్లు ఆన్ లైన్ కు పరిమితం చేశారు. అయితే రాహుకాల సమయం ముగిసిపోతుందని భక్తులు మరింత శీఘ్రంగా వెళ్లేందుకు ప్రయత్నించడం ఒక్కసారి ఆన్ లైన్ వ్యవస్థ కొంత సమయం స్తంభించింది దీంతో భక్తులు ఆందోళనలకు గురయ్యారు. అయితే సమాచారం అందుకున్న ఆలయ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

## కదిలే బస్సు దిగిన ప్యాసింజర్, టైర్ కింద పాదం నుజ్జు



**వరదయ్యపాలెం, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా,సత్యవేడు నియోజకవర్గం, వరదయ్యపాలెం మండలం నందు ఆర్టిసి బస్టాండ్ వద్ద ఆదివారం నాడు నెల్లూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కిన పాండూరుకు చెందిన హారిక (16), తనతోపాటు వచ్చిన తల్లి జనాభా రద్దీ రిత్య ఎక్కలేదు అని తెలిసి తొందరపాటులో కదులుతున్న బస్సు నుండి దిగిన క్రమంలో బస్సు వెనుక టైర్ హారిక కాలి పాదం మీరు ఎక్కడంతో పాదం నుజ్జు అయి తీవ్ర గాయం ఏర్పడింది, వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108 ద్వారా మెరుగైన చికిత్స కొరకు శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

### - జిల్లా ఇంచార్జి కలెక్టర్ సి.విష్ణుచరణ్

**అనంతపురం, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో “మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100” అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.జూన్ 01వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ :జూన్ 01వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. వడగాలుల అంచనా మరియు ప్రస్తుతం నెలకొన్న అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా, మరియు ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు మరియు మహిళలు సుదూర గ్రామాలు మరియు మండలాల నుండి వస్తున్నందున, ప్రజా భద్రత దృష్ట్యా మరియు వడదెబ్బను నివారించడానికి, సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.

## తిరుపతి జిల్లా

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన డాక్టర్ మునుస్వామి ఇకలేరు

### - మాంబట్టు గ్రామంలో విషాద ఛాయలు - వైద్య రంగానికి తీరని లోటు



**తడ,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తడ మండలం మాంబట్టు గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ మునుస్వామి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ప్రాంత ప్రజలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ప్రజల ఆరోగ్య సంరక్షణనే జీవిత లక్ష్యంగా భావించి సేవలందించిన ఆయన అకాల మరణం వైద్య రంగానికి తీరని లోటుగా మారింది.డాక్టర్ మునుస్వామి మరణవార్త తెలుసుకున్న మాజీ మంత్రి పరసరత్నం ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తూ, డాక్టర్ మునుస్వామి సేవలను కొనియాడారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన మంచి వైద్యుడిని కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు.తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో వైద్యుడిగా సేవలందించిన డాక్టర్ మునుస్వామి తన ప్రతిభ, నైపుణ్యం, మానవతా దృక్పథంతో వేలాది మంది రోగుల అభిమానాన్ని సంపాదించారు. ఆయనను ప్రజలు కేవలం వైద్యుడిగానే కాకుండా ఆపదలో అండగా నిలిచే వ్యక్తిగా భావించేవారు. నిరుపేదలకు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా వైద్య సేవలు అందించడంలో ఆయన ముందుండేవారు.ఆదివారం ఉదయం స్వగ్రామం మాంబట్టులోని దేవాలయంలో జరుగుతున్న పూజా కార్యక్రమాలకు హాజరుకావడానికి కారులో బయలుదేరిన డాక్టర్ మునుస్వామి అపాచీ రోడ్డుపై ప్రయాణిస్తుండగా కారు వెనుక టైరు ఒక్కసారిగా పేలింది. దీంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కనున్న వేపచెట్టును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.సమాచారం అందుకున్న తడ ఎస్సై కొండపనాయుడు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.డాక్టర్ మునుస్వామి మరణవార్త తెలిసిన వెంటనే మాంబట్టు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, ఆయన వద్ద చికిత్స పొందిన రోగులు, వైద్య సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎల్లప్పుడూ చిరునవ్వుతో పలకరించే ఆయన వ్యక్తిత్వం, రోగుల పట్ల చూపిన మానవతా దృక్పథాన్ని పలువురు కన్నీటి పర్యంతమై గుర్తు చేసుకున్నారు.వైద్య వృత్తిని ఉద్యోగంగా కాకుండా సేవగా భావించిన డాక్టర్ మునుస్వామి అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపారు. అవసరమైన ప్రతి సందర్భంలో వైద్య సహాయం అందిస్తూ ప్రజల ప్రేమాభిమానాలను చూరగొన్నారు. తన అంకితభావం, నైపుణ్యంతో వైద్య రంగంలో ప్రత్యేక స్థానం సంపాదించిన ఆయన సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయని స్థానికులు భావోద్వేగంతో పేర్కొన్నారు.డాక్టర్ మునుస్వామి అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో ప్రజలు, వైద్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు హాజరై నివాళులర్పించనున్నారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం నిరంతరం శ్రమించిన ఆయన సేవలు ఎప్పటికీ మరువలేనివని గ్రామస్తులు కన్నీటి నివాళులు అర్పించారు.

## రెవెన్యూ జట్టుపై ఎస్పీ జట్టు ఘన విజయం


### - సుబ్బిరెడ్డికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్



**వాల్మీకిపురం,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వాల్మీకిపురంలోని సీడీసీఏ--జీవీఎస్‌సీఎస్ క్రికెట్ గ్రౌండ్స్‌లో ఆదివారం రెవెన్యూ జట్టు, పోలీస్ (ఎస్పీ) జట్ల మధ్య స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా జరిగింది. ఈ విషయాన్ని చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్ తెలిపారు.రెవెన్యూ జట్టుకు జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ కెప్టెన్‌గా, పోలీస్ జట్టుకు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుగులి కెప్టెన్‌గా వ్యవహరించారు. ఉద్యోగులు, పోలీసు సిబ్బంది ఆటల ద్వారా శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, ఎస్పీ ధీరజ్ కునుగులి పేర్కొన్నారు.ముందుగా టాస్ గెలిచిన రెవెన్యూ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 18.1 ఓవర్లలో 10 వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. జట్టులో ముబారక్ అత్యధికంగా 33 పరుగులు సాధించారు.అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఎస్పీ జట్టు 16.4 ఓవర్లలో 136 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. జట్టులో సుబ్బిరెడ్డి 41 పరుగులతో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన సుబ్బిరెడ్డిని ‘మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్’గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ధీరజ్ కునుగులి, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్, చీఫ్ కోచ్ సునీల్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాజా రమేష్, వాల్మీకిపురం సబ్ ఇన్‌స్పెక్టర్ సీటీ స్వామి, తహసీల్దార్ ఎన్. పాములేటి, రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది, జీవీఎస్‌సీఎస్ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## వెంబలూరు రైతులకు అండగా నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

### రైతుల హక్కుల కోసం అవసరమైతే కోర్టుల వరకు వెళ్తాం : నేదురుమల్లి



**వెంకటగిరి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వెంబలూరు గ్రామంలో పట్టా భూమిలో సాగు చేస్తున్న నిమ్మ చెట్ల తొలగింపు ఘటనపై వెంకటగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఆదివారం స్పందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఆయన బాధిత రైతులు పూల వెంకటేశ్వర్లు, పూల కిష్టయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేదురుమల్లి మాట్లాడుతూ, రైతులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, చట్టబద్ధమైన ప్రక్రియను పాటించకుండా రాత్రివేళ పోలీసు బందోబస్తుతో భూముల్లోకి ప్రవేశించి చెట్లను తొలగించడం అత్యంత బాధాకరమని అన్నారు. ప్రజల ఆస్తులు, హక్కులను కాపాడాల్సిన అధికారులు భయాందోళనలు సృష్టించే విధంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. రైతుల పక్షాన వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ నిలబడుతుందని స్పష్టం చేసిన ఆయన, ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు బాధితులకు న్యాయం జరిగే వరకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అవసరమైతే న్యాయపోరాటం కూడా చేపడతామని వెల్లడించారు.

## భారీ వర్షాలకు వృక్షాలు కుప్పకూలాయి

**అనంతపురం, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలో రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఈదురు గాలులకు వివిధ ప్రాంతాలలో వృక్షాలు నేలకూలాయి. అందులో భాగంగా జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయానికి వెళ్లే వాహనాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.శనివారం రాత్రి కురిసిన వర్షాలకు నగరంలోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయం ముందు ఎస్ ఎస్ బి ఎన్ కళాశాలలోని వృక్షాలు రాత్రి కురిసిన భారీ వర్షాలకు చెట్లు రోడ్డుకు అడ్డంగా నేలకూలాయి. రహదారి కి అడ్డంగా చెట్లు కూలడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ తీగలపై భారీ వృక్షాలు పడడంతో ఆ పరిసర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం కలిగింది. మున్సిపల్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది.

# రైతును చితకబాదిన లారీ డ్రైవర్

## - ఏఎంసీ మార్కెట్ యాడ్ గేట్లకు తాళాలు వేసిన రైతులు



**పుంగనూరు , మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని ఏఎంసీ మార్కెట్ యాడ్ ఆవరణంలో రైతును చితకబాదిన సంఘటన చోటు చేసుకుంది. రైతుల కథనం మేరకు శనివారం రాత్రి సుమారు ఎనిమిది గంటల ప్రాంతంలో రామసముద్రం మండలం మానివారిపల్లి పంచాయతీ మిట్టమీద చీమనపల్లి కు చెందిన రైతు వెంకటరమణ(28) ట్రాక్టర్ లో టమోటాలు బాక్సులు వేసుకుని మార్కెట్ యార్డ్ లోపలకు వచ్చాడని . అయితే మార్కెట్ మండిలో టమోటాలు లోడ్ చేసుకున్న ఏపీ 03 టి ఈ7475 లారీ మార్కెట్ బయటకు వెళ్లడానికి వస్తుండగా రోడ్డు జామ్ అయిందని ఆ తరుణంలో ట్రాక్టర్ తోలుతున్న వెంకటరమణకు లారీ డ్రైవర్ మధ్య వాగు వివాదం జరిగిందని, అప్పుడే మండి లో పనిచేస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికి రావడం జరిగిందని లారీ డ్రైవర్ ఆ ఇద్దరు వ్యక్తులు కలిసి వెంకటరమణ ను చితకబాదారని, లారీ డ్రైవర్ లారీని తీసుకొని వెళ్లిపోయాడని గాయాల పాలైన వెంకటరమణను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించామని ఇదే విషయాన్ని పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. అయితే ఉదయం మార్కెట్ యార్డ్ కు వచ్చిన రైతులందరూ కలిసి తమ రైతుకు న్యాయం చేయాలని మార్కెట్ యార్డ్ గేట్లను మూసివేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సమీపతి రైతులకు న్యాయం చేసే విధంగా పోలీసు వారి సహకారంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు అన్నారు .సీఐ సుబ్బరాయుడు తన బృందంతో అక్కడికి చేరుకొని రైతులకు సర్ది చెప్పి ఇప్పటికే మీ రైతు మీద చేయి చేసుకున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని రైతుకు న్యాయం చేస్తామని తెలియజేశారన్నారు .

# పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఘన సన్మానం



**కుప్పం,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గత 35 సంవత్సరాలుగా ఏపీఎస్ఆర్టీసీ సంస్థలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఐదుగురు ఉద్యోగులను కుప్పం ఆర్టిసి డిపోలో ఘనంగా సన్మానించారు. డిపో అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి ఎస్ మునిరత్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సన్మానించి, వారు పదవీకాలంలో సంస్థ అభివృద్ధికి చేసిన కృషిని, ప్రయాణికులకు అందించిన సేవలను గుర్తుచేసుకొని అభినందించారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపిన సహచర ఉద్యోగులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పదవీ విరమణ పొందిన వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు.

# ఏఎంసీ చైర్మన్‌కు వినతి పత్రం సమర్పించిన రైతులు



**పుంగనూరు , మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని వ్యవసాయ అగ్రికల్చర్ మార్కెట్ చైర్మన్ సమీపతి యాదవ్ ను అగ్రికల్చర్ మార్కెట్ సెక్రెటరీ గోపి ను రైతులు ఆదివారం కలసి వినతి పత్రం సమర్పించారు. రైతులు మాట్లాడుతూ మార్కెట్ యార్డులో నీ మండి దారులు కాటా కాయలు ఎత్తుతున్నారని, మండి వారు మాకు పంపిస్తున్న టమోటా బాక్సులకు రెండు రూపాయలు వసూలు చేస్తున్నారని, నాలుగు పర్సెంట్ తీసుకోవాల్సిన కమిషన్ 10% తీసుకుంటున్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా మీరు స్పందించి మండివారు కాటా కాయలు ఎత్తకుండా, బాక్సులకు రెండు రూపాయలు వసూలు చేయకుండా, కమిషన్ నాలుగు పర్సెంట్ మాత్రమే వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంజన్న, బాలాజీ, ముని వెంకటరమణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడీఏ వాసు సేవలు అనిర్వచనీయం

## - జిల్లా వ్యవసాయశాఖ జేడీ మురళి ప్రశంస



**చిత్తూరు,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా వ్యవసాయశాఖలో పలు క్యాడర్లలో విధులు నిర్వహించిన గోపతి వాసు సేవలు అనిర్వచనీయమని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ( జేడీ ) మురళి ప్రశంసించారు. చిత్తూరు జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో జిల్లా రిసోర్స్ సెంటర్ డిఆర్సి, ఏడిఏగా విధులు నిర్వహించిన జీ వాసు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ క్రమంలో శనివారం నగరంలోని మ్యాంగో భవన్ లో ఆయనకు పదవి విరమణ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయశాఖ జేడీ మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ విధి నిర్వహణలో వాసు నిస్వార్థ సేవలు అందించారని, శాఖాపరంగా క్రింది స్థాయి సిబ్బందికి సూచనలు ఇస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ వ్యవసాయశాఖకు వాసు సేవలు చేశారన్నారు. వాసు తన శేష జీవితాన్ని సుఖ సంతోషాలతో గడపాలని జేడీ ఆ సందర్భంగా ఆకాంక్షించారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన వాసుకు జిల్లా వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వాసు కుటుంబ సభ్యులు, పెద్ద ఎత్తున ఉద్యోగుల సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయశాఖ డీఆర్సీ డీటీసీ, ఏడీఏగా లక్ష్మిప్రసన్న



**చిత్తూరు ,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వ్యవసాయశాఖ జిల్లా రిసోర్స్ సెంటర్ ( డీఆర్సీ ) డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కో - ఆర్డినేటర్ ( డీటీసీ ), కమ్ అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ ( ఏడీఏ ) గా బి లక్ష్మీప్రసన్న నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో అగ్రికల్చర్ ఆఫీసర్ గా పనిచేస్తున్న ఆమెకు డీఆర్సీ డీటీసీగా, ఏడీఏగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ మనజిర్ జిలాని సమూన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇది వరకు డీటీసీ, ఏడిఏగా విధులు నిర్వహించిన జీ వాసు ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ క్రమంలో లక్ష్మీప్రసన్న ఆదివారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్నను తాజా మాజీ డీటీసీ, ఏడిఏ జీ వాసు, రిసోర్స్ సెంటర్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు అభినందించారు.

# ఘనంగా వెంకటరత్నం జయంతి వేడుకలు



**పలమనేరు, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి వెంకటరత్నం 71 వ జయంతి వేడుకలు కొలమాసనపల్లి ఏ వి ఆర్ కాంప్లెక్స్ ఎదురుగా టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 40 సంవత్సరాల పాటు తెలుగుదేశం పార్టీకి సేవలందించి, ఓటమి ఎరుగని నాయకుడిగా ఆయన ప్రసిద్ధి చెందారు. ఆరు నెలల క్రితం ఆయన మృతి చెందడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసి ఆయన 71 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ ను కట్ చేసి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షురాలు మంజులమ్మ, పలమనేరు రూరల్ మండల అధ్యక్షులు నాగరాజ రెడ్డి, మండల కార్యదర్శి గణేష్, మాజీ సర్పంచ్ సెల్వరాజ్, మైనారిటీ అధ్యక్షులు షరీఫ్, రామ్మూర్తి నాయుడు, గిరి, నరేష్ రెడ్డి, వినోద్, వెంకటేష్, సునీల్, దయ, దేవేంద్ర, మురళి, రాజా రత్నం, తదితరులు పాల్గొన్నారు.

# నేడే ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**కుప్పం, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం పట్టణంలోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్టు కడ అధికారులు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించుకునే వెసులుబాటు సామాన్య ప్రజలకు కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించాలని అన్ని రకాల ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సోమవారం నాడు కడ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కడ పిడి వికాస్ మరమ్మత్ పాల్గొని, ప్రజల సమస్యలపై విచారణ చేపట్టనున్నట్టు తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, తాము ఎదుర్కొంటున్న సమస్యలను వినతి రూపంలో కడపిడీకి అందజేయాలని వారు సూచించారు.

# సమాచార హక్కు చట్టం నామఫలకాలు విధిగా ఏర్పాటు చేయాలి

**కుప్పం, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద మరియు కుప్పం కడ కార్యాలయం వద్ద సమాచార హక్కు చట్టం నామఫలకాలు ఏర్పాటు చేయకపోవడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం ముందు విధిగా ఏర్పాటు చేయాల్సిన సమాచార హక్కు చట్టం నామ పలకాలు కుప్పం కడా కార్యాలయ అధికారులు కుప్పం మండల రెవెన్యూ శాఖ అధికారులు విస్మరించడం బాధ్యతారాహిత్యం కాదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే కార్యాలయాల ముందు సమాచార హక్కు చట్టం నామఫలకాలు ఏర్పాటు చేయాలని పౌర సమాజం డిమాండ్ చేస్తున్నారు.



# చిత్తూరు జిల్లా

# శిశువిహార్‌కు ఏసీని వితరణ చేసిన ఎమ్మెల్యే గురజాల





**చిత్తూరు, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తూరు జిల్లా కలెక్టరేట్ సమీపంలోని శిశువిహార్ చిన్నపిల్లల సంరక్షణ కేంద్రానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఏసీని వితరణగా అందించారు. ఆదివారం జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా ఏసీని శిశువిహార్ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిశువిహార్ ను పరిశీలించి పిల్లల సంరక్షణ, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి సేవిస్తే కిట్ ద్వారా పరీక్షలు : మోహన్ రెడ్డి



**పలమనేరు ,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా ఎస్పీ తుషార్ దూడే ఆదేశాల మేరకు పలమనేరు డిఎస్పి దేగల ప్రభాకర్ సహకారంతో స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఆదివారం విలేకరుల సమావేశాన్ని సీఐ మోహన్ రెడ్డి, నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇకమీదట పలమనేరు పరిసర ప్రాంతాలలో యువకులు, పురుషులు ఎవరైనా గంజాయి సేవిస్తే వారికి కిట్టు ద్వారా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పలమనేరు పట్టణం నందు, మండలంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కడ్రన్ సెర్చ్ నందు ఏడు మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ వచ్చిందన్నారు. పోలీసు వారు పిల్లల తల్లిదండ్రులకు తెలియజేయడమేమనగా గంజాయి డ్రగ్స్ సేవించిన ఎడల వారికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐలు, పలమనేరు అర్బన్ ఎస్సైలు లోకేష్ రెడ్డి, స్వర్ణ తేజ, ఎస్ టి ఎఫ్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# సాయి కిషోర్ జూనియర్ కళాశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**పలమనేరు, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గంగవరం మండలంలో సాయి కిషోర్ జూనియర్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కళాశాలను ప్రారంభించిన పలమనేరు శాసన సభ్యులు ఎన్. అమరనాథ రెడ్డి ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఆయనకు ఘనంగా స్వాగతం తెలియజేసి జ్ఞాపికలతో సన్మానించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు గల విద్యా సంస్థల ఏర్పాటుతో విలువలతో కూడిన విద్య అందుతుందని ఆ కోవకు చెందిన సాయి కిషోర్ కళాశాలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పలమనేరు పట్టణ, కుట్టి, కోటి, భాస్కర్ యాదవ్, గంగవరం మండల టీడీపీ నాయకులు సోమశేఖర్ గౌడ్, పాల్గొన్నారు.

# వాల్మీకులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోండి

## - ఉమ్మడి చిత్తూరు జిల్లా వాల్మీకి సంఘ నాయకుల డిమాండ్



**పలమనేరు, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గత కొన్ని దశాబ్దాలుగా వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వం తమ హామీలు నిలబెట్టుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా వాల్మీకి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ముఖ్య వాల్మీకి సంఘ నాయకులతో పలమనేరు పట్టణంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు నాయకులు ప్రసంగిస్తూ గత 70 సంవత్సరాలుగా వాల్మీకి బోయలను ఎస్టీలుగా పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వివిధ రకాల ఆందోళనలు చేపట్టినప్పటికీ ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదని ఆరోపించారు. రాయలసీమ ప్రాంతంలో ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్న వాల్మీకులను పావులుగా వాడుకుని ఎన్నికల తర్వాత విస్మరిస్తుండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒక కులాన్ని ఒకే రాష్ట్రంలో ఒక్కో జిల్లాకు ఒక్కో ప్రాంతానికి ఒక్క రిజర్వేషన్ చొప్పున ప్రాంతీయ విభేదాలను సృష్టించి కొన్ని జిల్లాల్లో గిరిజనులుగా కొన్ని జిల్లాల్లో బీసీలుగా విభజించి పాలించడం చాలా దారుణమైన విషయమని పేర్కొన్నారు. కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం మీద నెట్టివేయడం సమంజసం కాదని అన్నారు. రెండుసార్లు రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన ఇంతవరకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించడంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురాలేకపోవడం దారుణమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో మాత్రమే వాల్మీకుల సమస్యను గుర్తిస్తున్నారని, తర్వాత మా సమస్య కనుమరుగవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి కేంద్రం ద్వారా వాల్మీకులను ఎస్సీలుగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రాజకీయ పార్టీలు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు, న్యాయ వాది ఎల్. భాస్కర్,రిటైర్డ్ ఆర్డీఓ త్యాగరాజులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా వాల్మీకి సంఘ నాయకులు కుప్పం సురేష్, అద్దాల నాగరాజు, పొదల నరసింహులు, వాల్మీకి పురం విష్ణు చైతన్య, గంగరాజు, మాజీ సర్పంచ్ లు శ్రీనివాసులు, గంగప్ప, చలపతి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, మాడి శంకరప్ప, రామచంద్ర నాయుడు, గంగవరం బాలాజి, నరసింహులు, వి. కోట జయచంద్ర నాయుడు, అశోక్, దాము, వెంకటాచలపతి, మునస్వామి, ఉప్పెనల్లి రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

# గురువులకు సన్మానం చేసిన పూర్వ విద్యార్థులు



**రామకుప్పం, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామకుప్పం పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక ఎమ్ ఆర్ ఆర్ కళ్యాణమండపం లో ఘనంగా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. 2002- 2002 విద్యా సంవత్సరం పదవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థిని విద్యార్థినిలు ఈ కార్యక్రమానికి హాజరై తమ గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు ఈ సందర్భంగా విద్యార్థులు తమ పూర్వ పాఠశాల ఉపాధ్యాయులను పాఠశాల సిబ్బందిని ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలు పొంది వారికి చిరు కానుకలను సమర్థించుకున్నారు ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థి ప్రస్తుత మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ తమ విద్యాభ్యాస కాలంలో ఎంతోమంది గురువులు స్నేహితులు తమకు మంచి సూచనలు సలహాలు బుద్ధిని నేర్పించడం వలనే నేడు సమాజంలో ఒక ఉన్నత స్థానానికి చేరుకున్నానని తాను ఏ స్థాయిలో ఉన్నా కూడా తన చిన్ననాటి మిత్రులను చదువు చెప్పిన గురువులను మరవబోనని ఎల్లప్పుడూ వారికి తాను ప్రత్యేక స్థానం ఇస్తానని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు రవి రెడ్డి రాంప్రసాద్ రెడ్డి, రాజగోపాల్, కేశవ, మంజునాథ్, మునిరెడ్డి, సతీష్, కృష్ణారెడ్డి పెద్ద ఎత్తున పూర్వపు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న పొగాకు ఉత్పత్తులు

## సాయిరాం హాస్పిటల్‌లో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంపై అవగాహన



**పలమనేరు, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం (వరల్డ్ ఏంటి తోభాకౌ డే ) సందర్భంగా పలమనేరు పట్టణంలోని సాయిరాం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పలమనేరు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఎంఏ పలమనేరు శాఖ అధ్యక్షులు డా. యుగంధర్ గారు ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు, రోగులకు వారి కుటుంబ సభ్యులకు పొగాకు వినియోగం వల్ల కలిగే తీవ్రమైన ఆరోగ్య సమస్యల గురించి సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. యుగంధర్ మాట్లాడుతూ పొగాకు ప్రపంచవ్యాప్తంగా నివారించగలిగే మరణాలకు ప్రధాన కారణాలలో ఒకటిగా నిలుస్తోంద న్నారు. సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ, జర్దా పాన్ మసాలా వంటి పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని తెలిపారు. ముఖ్యంగా నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండె జబ్బులు అధిక రక్తపోటు పక్షవాతం శ్వాసకోశ వ్యాధులు క్షయవ్యాధి వంటి అనేక ప్రాణాంతక సమస్యలకు పొగాకు ప్రధాన కారణమని వివరించారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం లక్షలాది మంది పొగాకు సంబంధిత వ్యాధుల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పొగ తాగేవారితో పాటు వారి చుట్టూ ఉండే కుటుంబ సభ్యులు కూడా పాసివ్ స్మోకింగ్ కారణంగా అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు దీనివల్ల ఎక్కువ ప్రమాదాన్ని ఎదుర్కొంటారని తెలిపారు. పొగాకు అలవాటును మానే యడం ద్వారా ఆరోగ్యంలో వేగంగా సానుకూల మార్పులు కనిపిస్తాయని డా. యుగంధర్ వివరించారు. పొగ తాగడం మానేసిన కేవలం 20 నిమిషాలలోనే రక్తపోటు మరియు గుండె స్పందన సాధారణ స్థితికి చేరుకోవడం ప్రారంభమవుతుందని తెలిపారు. 12 గంటలలో శరీరంలోని కార్బన్ మోనాక్సైడ్ స్థాయిలు తగ్గి రక్తంలో ఆక్సిజన్ పరిమాణం పెరుగుతుం దని చెప్పారు. 2 నుండి 12 వారాల వ్యవధిలో రక్తప్రసరణ మెరుగుపడి ఊపిరితిత్తుల పనితీరు గణనీయంగా పెరుగుతుందని వివరిం చారు. ఒక సంవత్సరం పాటు పొగాకు వినియోగానికి దూరంగా ఉంటే గుండె జబ్బుల ప్రమాదం దాదాపు సగానికి తగ్గుతుందని, ఐదు సంవత్సరాల తరువాత పక్షవాతం వచ్చే ప్రమాదం కూడా సాధారణ వ్యక్తులతో సమాన స్థాయికి చేరుతుందని పేర్కొన్నారు. పదేళ్ల తరువాత ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గుతుందని పదిహేను సంవత్స రాల తరువాత గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం పొగాకు ఎప్పుడూ ఉపయోగించని వ్యక్తుల స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పొగాకు మానడం కష్టమైనప్ప టికీ అసాధ్యం కాదని, కుటుంబ సభ్యుల సహకారం, వైద్యుల సలహాలు, కౌన్సెలింగ్, బలమైన సంకల్పం ఉంటే ఎవరైనా ఈ అలవాటును పూర్తిగా విడిచిపెట్టగలరని ఆయన చెప్పారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకర మైన జీవన శైలిని అలవర్చు కోవాలని సూచించారు. ప్రజలందరూ పొగాకు రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, తమ కుటుంబాలను భవిష్యత్ తరాలను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్న రోగులు, వారి కుటుంబ సభ్యులు మరియు ప్రజలు పొగాకు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో సాయిరాం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, ఐఎంఏ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# మిట్స్‌కు ఎఎఎ రేటింగ్

## రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంక్


### - ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి హర్షం




**మదనపల్లె/ కురబలకోట,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ మదనపల్లెకు జాతీయస్థాయిలో టాప్ 20 కళాశాలగా ఎఎఎ రేటింగ్ లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ ఆదివారం తెలిపారు.జాతీయ స్థాయిలో ఎన్.పీ.టి.ఈ.ఎల్ వారు ఆన్లైనులో జనవరి – ఏప్రిల్ 2026 సెషన్ లో నిర్వహించిన పరీక్షలలో కళాశాల విద్యార్థులు మరియు అధ్యాపకులు మొత్తం 8758 సర్టిఫికెట్ కోర్సులకు హాజరు కాగా అందులో 7484 ప్రతిభ కనపరిచి జాతీయ స్థాయిలో ఎన్.పీ.టీ.ఈ.ఎల్ సర్టిఫికెట్ ను పొందడమే కాక,925 మందికి గోల్డ్ రేటింగ్,సిల్వర్ 1690 మరియు ఎలైట్ 2743 కి లభించిందని అంతే కాకుండా కళాశాలకు ఎఎఎ రేటింగ్ తోపాటు టాప్ 20లో మిట్స్ కళాశాలకు జాతీయ స్థాయిలో 10వ ర్యాంక్ మరియు రాష్ట్రస్థాయిలో 1వ ర్యాంకుగా గుర్తింపును అందించినట్లు ఆయన అన్నారు.కళాశాలకు ఎన్.పీ.టీ.ఈ.ఎల్ వారు అందించిన ఈ గుర్తింపుకు కృషి చేసిన విద్యార్థులు మరియు అధ్యాపకులు చేసిన కృషికి మిట్స్ యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి,ప్రో ఛాన్సలర్ ఎన్.ద్వారకానాథ్ మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల విద్యార్థులు మరియు అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# నేర ప్రవృత్తి వీడకుంటే కఠిన చర్యలు

### - పాత నేరస్థులకు పోలీసు అధికారుల కౌన్సిలింగ్




**మదనపల్లె, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా, నేరాల నియంత్రణే లక్ష్యంగా అన్నమయ్య జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, పాత నేరస్థులకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్లకు రౌడీషీటర్లను పిలిపించి వారి ప్రస్తుత జీవన విధానం, కదలికలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సత్ప్రవర్తనతో మెలగాలంటూ వారికి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. భవిష్యత్తులో ఎలాంటి అసాంఘిక, క్రిమినల్ కార్యకలాపాలకు పాల్పడినా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా సహించేది లేదని స్పష్టం చేశారు. పాత నేరస్థులు, సమాజానికి ఇబ్బంది కలిగించే వ్యక్తులు తమ ప్రవర్తనను మార్చుకోవాలని, చట్టవిరుద్ధమైన పనులకు దూరంగా ఉంటూ సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సూచించారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చట్టాల ప్రకారం కేసులు నమోదుచేస్తామని, మళ్లీ పాత నేరాల బాట పడితే జైలు శిక్షలు తప్పవని అధికారులు గట్టిగా హెచ్చరించారు. జిల్లాలో శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని, ప్రతి ఒక్కరి కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

# జిల్లాలో కొనసాగుతున్న గంజాయి 'రాపిడ్ టెస్టులు'

### -డ్రగ్ డిటెక్షన్ కిట్లతో ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు



**మదనపల్లె, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు.జిల్లా ఎస్పీ. ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు ఎన్‌డీపీఎస్ (ఎన్డీపీఎస్) కేసుల్లో పట్టుబడిన నిందితులకు, అనుమానితులకు అత్యాధునిక 'రాపిడ్ డ్రగ్ టెస్ట్'లను నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా తెప్పించిన 'డ్రగ్ డిటెక్షన్ కిట్ల' ద్వారా నిందితులు మత్తు పదార్థాలు సేవించారా లేదా అన్నది అక్కడికక్కడే నిర్ధారిస్తున్నారు. అయితే, జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు ఈ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించిన నిందితులందరికీ డ్రగ్స్ అలవాటు లేనట్లు 'నెగిటివ్' నివేదికలు వచ్చాయని పోలీసు అధికారులు వెల్లడించారు. మత్తు సంస్కృతికి యువత బానిస కాకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం నిఘా కొనసాగుతుందని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# మెగా డీఎస్సీపై నిరసన

### - నేడు 'చలో జిల్లా కలెక్టరేట్'కు హర్షవర్ధన్ రెడ్డి పిలుపు



**మదనపల్లె,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేస్తూ "దగా డీఎస్సీ"గా మార్చిన కూటమి ప్రభుత్వం మార్చిందని మదనపల్లె వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా జూన్ 1న ( సోమవారం) నిర్వహించనున్న "చలో జిల్లా కలెక్టరేట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ పేరుతో వేలాది ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను నిలబెట్టుకోకుండా డీఎస్సీ అభ్యర్థులను, నిరుద్యోగ యువతను మోసం చేసిందన్నారు.

# పిజిఆర్ఎస్ డే గ్రీవెన్స్ డే నిర్వహిస్తాం : ఆర్డీవో

**పీలేరు,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రతి సోమవారం జరిగే పి జి ఆర్ ఎస్ గ్రీవెన్స్ డే ఈరోజు కూడా పీలేరు ఆర్డిఓ కార్యాలయంలో నిర్వహిస్తామని పీలేరు ఇంచార్జ్ రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్ తెలిపారు డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాలు కలి కిరికలకడ గుర్రంకొండ వాల్మీకిపురం కె.వి పల్లి పీలేరు పీలేరు సదుం సోమల మండలాలలోని ప్రజలు తమకున్న సమస్యలను అర్జీ ద్వారా అందజేయాలని ఆర్డిఓ కోరారు సోమవారం ప్రతి ఒక్కరూ తాసిల్దారులు రెవెన్యూ సిబ్బంది ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిమగ్నం కావాలని ఆర్డిఓ ఆదేశించారు.



# అన్నమయ్య జిల్లా

# సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలు



**పీలేరు,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగు సినీ పరిశ్రమలో నటశేఖరుడిగా, సూపర్ స్టార్‌గా, నిర్మాతగా, దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మహానటుడు, మాజీ ఎంపీ ఘట్టమనేని కృష్ణ 84వ జయంతి వేడుకలను అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం పీలేరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమాన నటుడికి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కృష్ణ వీరాభిమాని పసుపులేటి వెంకటరమణ ఆధ్వర్యంలో కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్‌లోని ప్రయాణికులకు, ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేసి జయంతి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ, సూపర్ స్టార్ కృష్ణ తెలుగు సినీ పరిశ్రమకు ఎన్నో నూతన సాంకేతికతలను పరిచయం చేసిన మహానటుడని కొనియాడారు. నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సాహసోపేతమైన కథాంశాలను ఎంచుకుని, నూతన ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన కృష్ణ తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఆయన నటించిన చిత్రాలు నేటికీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయని తెలిపారు. నటుడిగానే కాకుండా 1989లో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికై ప్రజాసేవలోనూ తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. కళాకారుడిగా, ప్రజాప్రతినిధిగా కృష్ణ అందించిన సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణ అభిమానులు పసుపులేటి వెంకటరమణ, ఆర్టిస్ట్ రాము, శ్రీనివాసులు శాస్త్రి, ఎం.డి. షఫీ, ఆర్టీసీ వలి, ఖాజాపీర్, కార్గో ఆటో బాషా, జావీద్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డివైఇవో లోకేశ్వర్ రెడ్డి రిటైర్మెంట్

### - సేవలను కొనియాడిన ఎమ్మెల్యే



**పీలేరు, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా పీలేరు మండలం బాలంవారిపల్లి గ్రామం నూనెవాండ్లపల్లిలో ఆదివారం జరిగిన డివైఈవో లోకేశ్వర్ రెడ్డి రిటైర్మెంట్ ఫంక్షన్ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పీలేరు శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనకు పుష్పగుచ్చాలతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన నాటి నుండి నేటి వరకు నిజాయితీ, నిబద్ధతతో పనిచేసి, ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన లోకేశ్వర్ రెడ్డి సేవలు అభినందనీయం. ఉద్యోగ నిర్వహణలో ఆయన చూపిన క్రమశిక్షణ, అంకితభావం యువతకు ఆదర్శమని కొనియాడారు.రిటైర్మెంట్ తర్వాత కూడా సమాజ సేవలో చురుగ్గా పాల్గొని, తన అనుభవాన్ని ప్రజలకు పంచాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం లోకేశ్వర్ రెడ్డి దంపతులను శాలువాతో సత్కరించి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లి బాబు రెడ్డి, పీలేరు మండల అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి, శ్రీ అంకాలమ్మ ఆలయ చైర్మన్ కోడి రామకృష్ణారెడ్డి, కోటపల్లి శివారెడ్డి గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, లోకేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగస్తులు బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# చప్పిడి మహేష్ నాయుడు జన్మదిన వేడుకలు

**సుండుపల్లి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కువైట్ దేశంమాలియా ప్రాంతంలో బి.బి.క్యూ రెస్టారెంట్ నందు సుగవాసి యువసేన అధ్యక్షుడు కంచన రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో మరియు ఎన్.ఆర్.ఐ, ఏపీ టీడీపీ యూత్ అధ్యక్షుడు ఖాన్ భాయ్ అధ్యక్షతన మాజీ రాష్ట్ర టీడీపీ కార్యదర్శి రాజంపేట తెదేపా సీనియర్ నాయకుడు సుండుపల్లి పేద ప్రజల బడుగు బలహీన ముస్లిం మైనార్టీ వర్గాల ఆశాజ్యోతి పేదల పాలిట పెన్నిధి అయిన చప్పిడి మహేష్ నాయుడు జన్మదిన వేడుకలు అభిమానుల కార్యకర్తల సమక్షంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా ఎన్.ఆర్.ఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి చప్పిడి మహేష్ నాయుడు కు శుభాకాంక్షలు తెలియజేశారు.అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలకు చక్కటి విందు భోజనం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ఎన్.ఆర్.ఐ టీడీపీ సీనియర్ నాయకులు మాలేపాటి సురేష్ నాయుడు ,రత్నం నాయుడు ,సుగవాసి సాయి కిరణ్,హరినాథ్ , మనోజ్,వేణు రాజు,కొల్లి ఆంజనేయులు, కువైట్ ఆంధ్రా న్యూస్ భాషా ,చిన్న రాజు , లక్ష్మి రెడ్డి,సుంకర నరేష్,తిరుపతి రాజు , ఖదరున్, వెంకట బుజ్జి, సుగుణమ్మ,వెంకటరామ రాజు ,సిద్దులయ్య,మహేష్ గౌడ్ , జిలానీ ,మాధవ,భాషా ,సహదేవ,ఆచారి,కడప కన్నయ్య,నేతి రవి,అనీఫ్,మొహమద్ అలీ ,సుధాకర్ ,ముద్దం తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఓర్వలేకే డీఎస్సీపై వైసీపీ తప్పుడు ప్రచారం

### - రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ పఠాన్ ఖాదర్ ఖాన్



**మదనపల్లె,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూటమి ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించిన మెగా డీఎస్సీ నియామకాలకు ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణను చూసి వైసీపీ నాయకత్వం జీర్ణించుకోలేక తప్పుడు ఆరోపణలు చేస్తోందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్, రాజంపేట పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్ విమర్శించారు.ఆదివారం రాష్ట్ర టీడీపీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు సూదిల్లా సుధాకర్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క ఉపాధ్యాయ నియామకం కూడా చేపట్టని జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు డీఎస్సీపై మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. దేశంలోనే అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి, కేవలం 148 రోజుల్లో 15,941 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం కూటమి ప్రభుత్వ చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు.16,347 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి, 3.36 లక్షల దరఖాస్తులను స్వీకరించి, టీసీఎస్ ఆధ్వర్యంలో సీబీటీ విధానంలో పూర్తి భద్రతతో పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇంత పారదర్శకంగా జరిగిన ప్రక్రియపై ఏడాది తర్వాత అనుమానాలు సృష్టించడం వెనుక వైసీపీ బురదజల్లే రాజకీయమే తప్ప వాస్తవాలు లేవన్నారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు నాయకత్వంలో విద్యా రంగంలో వస్తున్న సానుకూల మార్పులు, ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు, ఉపాధ్యాయ నియామకాల విజయాన్ని చూసి వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.స్పోర్ట్స్ కోటా నియామకాలపై కూడా దుష్ప్రచారం చేస్తున్నారని, క్రీడాకారులు సమర్పించిన ప్రతి ధ్రువపత్రాన్ని సంబంధిత సంస్థల ద్వారా అధికారికంగా ధృవీకరించిన తర్వాతే నియామకాలు చేపట్టడం జరుగుతుందని స్పష్టం చేశారు.ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చూసి తట్టుకోలేక వైసీపీ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, ఇది వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని పఠాన్ ఖాదర్ ఖాన్ తీవ్రంగా విమర్శించారు.

# పరిశుభ్రతలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

### - ఆపరేషన్ క్లీన్ స్వీప్‌లో కమిషనర్ ప్రమీల



**మదనపల్లె, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ పరిశుభ్రతలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని మదనపల్లె మునిసిపల్ కమిషనర్ ప్రమీల కోరారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో భాగంగా నక్కల దీన్నే వద్దగల సత్సంగ్ ప్రాంతంలో మునిసిపల్ కమిషనర్ ప్రమీల, సత్సంగ్ ఫౌండేషన్ సిబ్బంది మరియు సెక్రటరీ స్టాఫ్ మున్సిపల్ స్టాప్, మెప్మా, పారిశుద్ధ్య విభాగాలు ఇంజనీరింగ్ విభాగాల సిబ్బంది రోడ్లను శుభ్రం చేశారు.అలాగే పరిసర ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలను ఎస్కవేటర్ ద్వారా తొలగించి శానిటేషన్ చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ , పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

# వాలి ప్రతిష్ఠించిన శివలింగం

### - మహిమల నిలయంగా వాలీశ్వర కొండ





**రామసముద్రం,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామసముద్రం మండలం ఆర్. నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం సమీపంలోని వాలీశ్వర కొండ పురాణ, ఆధ్యాత్మిక విశిష్టతతో భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది. ప్రకృతి సోయగాల నడుమ కొండపై వెలసిన వాలీశ్వర స్వామి ఆలయానికి నిత్యం భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. స్థానికంగా ప్రచారంలో ఉన్న పురాణ కథనం ప్రకారం, త్రేతాయుగంలో కిష్కింధ రాజు వాలి ఒక పవిత్ర శివలింగాన్ని తన రాజ్యానికి తీసుకెళ్తుండగా సాయంత్రం సంధ్యావందనం చేయాల్సి వచ్చింది. దీంతో ఈ కొండపై శివలింగాన్ని ఉంచి పూజలు నిర్వహించాడు. అనంతరం దానిని తిరిగి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా, తన అపార బలంతోనూ శివలింగాన్ని కదిలించలేక పోయాడని చెబుతారు. అప్పుడు పరమశివుడు ప్రత్యక్షమై కలియుగంలో భక్తుల పూజలు స్వీకరించేందుకు తాను ఇక్కడే కొలువుదీరాలని సంకల్పించినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి. ద్వాపరయుగంలో శివలింగం పుట్టలో మరుగునపడిపోయిందని, కలియుగంలో ఓ రైతు తన ఆవు ప్రతిరోజూ ఒక పుట్టపై స్వయంగా పాలు కారుస్తుండటాన్ని గమనించాడని స్థానికులు చెబుతున్నారు. ఆశ్చర్యపోయిన రైతు పుట్టను తొలగించే క్రమంలో శివలింగం బయటపడిందని, అప్పటి నుంచి గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించడం ప్రారంభించారని విశ్వసిస్తున్నారు. వాలి ప్రతిష్ఠించిన శివలింగం కావడంతో ఈ ప్రాంతం "వాలీశ్వర కొండ"గా ప్రసిద్ధి చెందింది. కొండపైకి చేరుకున్న భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ముఖ్యంగా శివరాత్రి, కార్తీకమాసం సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ప్రకృతి అందాలు, పురాణ గాథ, ఆధ్యాత్మిక వాతావరణం కలగలిసిన ఈ క్షేత్రం ప్రాంతంలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందుతోంది.

# గ్రామీణ విద్యార్థుల్లో నైపుణ్యమే లక్ష్యం

### - మీడియాకు ఐఆర్ఎస్ బి.యాదగిరి వెల్లడి




**మదనపల్లె, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారిలో నైపుణ్యాలను మెరుగుపరచి ప్రయోజకులుగా తీర్చి దిద్దడమే పినాక ప్రజాసాధికార సంస్థ ప్రధాన లక్ష్యమని సంస్థ వ్యవస్థాపకులు, ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ యాదగిరి తెలిపారు. పట్టణంలోని స్థానిక జ్ఞానోదయ విద్యాసంస్థలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను సందర్శించి విద్యార్థులకు ప్రత్యేక స్కిల్ ట్రైనింగ్ అందించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం,ఆంగ్ల భాషా ప్రావీణ్యం,జీవిత నైపుణ్యాల పెంపొందించడం కోసం వేసవిలో 21 రోజులపాటు ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.ఈ శిక్షణలో భాగంగా ఉచిత భోజన సౌకర్యంతోపాటు అవసరమైన అధ్యయన సామగ్రిని కూడా అందిస్తున్నామని వివరించారు.ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.గత ఆరు సంవత్సరాలుగా మదనపల్లి,తిరుపతి,పలమనేరు,నగరి,అనంతపురం,ధర్మవరం,నంద్యాల ప్రాంతాల్లో ప్రతి ఏడాది మే నెలలో ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తు న్నట్లు ప్రకటించారు.పినాక ప్రజా సాధికార సంస్థ నుంచి శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు నేడు అత్యున్నత స్థాయిలో పదవులు అలంక రించి రాణిస్తున్నారని గుర్తుచేశారు.అంతేకాక ఇప్పటి వరకు 6,500 మంది విద్యార్థులు శిక్షణ తీసుకొని తద్వారా వివిధ హోదాల్లో స్థిరపడ్డారని వెల్లడించారు.ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అన్నిరకాల పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణను అందించి విద్యార్థుల ను ఉన్నత స్థానాలకు చేర్చడమే తమ సంకల్పమన్నారు.అనంతరం మాజీ ఎంపీటీసీ దంపతులు బెల్లెరెడ్డి ప్రసాద్,బెల్లె హారతిలు యాదగిరిని శాలువా,పుష్ప గుచ్ఛంతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆర్మీ డైరెక్టర్ జనరల్, కనకదాస చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు పరంధామ గౌడ,వల్లిగట్ల వెంకటరమణ,విశ్రాంత ట్రాన్స్‌కో అధికారి కృష్ణప్ప,ప్రసాద్,చలపతిలు పాల్గొన్నారు.

# వెనుకబడిన రెడ్డి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

**చింతకొమ్మదిన్నె, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి విద్యార్థులకు అవర్ రెడ్డి ఫౌండేషన్ (రా=ఖీ) ఆధ్వర్యంలో 2026-2027 విద్యా సంవత్సరానికి గాను విద్యా ధన్ స్కాలర్‌షిప్ పంపిణీ కార్యక్రమం హోటల్ ది ప్లాజా,బేగంపేట, హైదరాబాద్‌లో విజయవంతంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా వ్యవస్థాపక చైర్మన్ పెరియావరం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఉపకార వేతనాలు అందజేశామని తెలిపారు. కేవలం ఆర్థిక సహాయమే కాకుండా,విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం సాంకేతిక నైపుణ్యాలు,వ్యక్తిత్వ వికాసం, సామాజిక నైపుణ్యాలపై విలువైన సలహాలు, సూచనలు అందజేయడమే కాకుండా విద్య నైపుణ అభివృద్ధి ద్వారా అర్హులైన విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడమే తమ ఫౌండేషన్ లక్ష్యమని ఆయన వివరించారు. అనంతరం వ్యవస్థాపక సభ్యులు గుట్టికొండ శివ సుందర్ రెడ్డి,సిఎ యల్లంద కొండల్ రెడ్డి, పాలగిరి సుబ్బా రెడ్డి,జగన్ మోహన్ రెడ్డి,డా.స్వాతి రెడ్డి, డా. రజని రెడ్డి,దివాకర్ రెడ్డి, డి మధు సుధన్ రెడ్డి,రాజా మోహన్ రెడ్డి, రంగా రెడ్డి మరియు దాతలు బి. వీరా రెడ్డి,ఎస్ఎన్ రెడ్డి, కె.అశ్విని రెడ్డి,కవిత రెడ్డి,శోభా రెడ్డి, కె.భరత్ రెడ్డి,సిఎ సురేష్ రెడ్డి, టిఎస్ రెడ్డి, పుష్ప రెడ్డి మరియు చల్లా చైతన్య రెడ్డి తదితరులు పాల్గొని అవర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తు లో చేపట్టబోయే కార్యక్రమాలు,విద్యార్థి సాధికారత దృష్టి గురించి తమ అమూల్యమైన సలహాలు సందేశాలు వివరించారు.ఈ కార్యక్రమంలో ఓ ఆర్ ఎఫ్ వ్యవస్థాపక సభ్యులు,కమిటీ సభ్యులు,దాతలు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మజ్జిగని భగవంతుడు సృష్టించాడట!





వేసవి కాలాన్ని మనం మజ్జిగతోనే ఎక్కువగా గడిపేందుకు ప్రయత్నించాలి. తోడుపెట్టినందు వలన పాలలో ఉండే పోషక విలువలన్నీ మజ్జిగలోనూ పదిలంగా ఉండటంతో పాటు, అదనంగా "లాక్టో బాసిల్లై" అనే "మంచి బాక్టీరియా" మనకు దొరుకుతుంది. పాలలో ఈ ఉపయోగకారక బాక్టీరియా ఉండదు. అందుకని, వయసు పెరుగుతున్నకొద్దీ మజ్జిగ అవసరం పెరుగుతుంది. చఫ్రిజ్జులో పెడితే మజ్జిగలోని ఈ బాక్టీరియా నిరర్థకం అవుతుంది. అందుకని అతి చల్లని మజ్జిగ తాగకూడదుచ. చిలికినందువలన మజ్జిగకు తేలికగా అరిగే గుణం వస్తుంది. అందుకని పెరుగుకన్నా మజ్జిగ మంచిది.

**వేసవి కోసం ప్రత్యేకం "కూర్చిక పానీయం":**
ఒక గ్లాసు పాలు తీసుకొని, కాచి చల్లార్చి అందులో రెండుగ్లాసుల పుల్లని మజ్జిగ కలపండి. ఈ పానీయాన్ని 'కూర్చిక' అంటారు. ఇందులో "పంచదార" గానీ, "ఉప్పు" గానీ కలపకుండానే తాగవచ్చు. "ధనియాలు", "జీలకర్ర", "శొంఠి" ఈ మూడింటినీ 100 గ్రాముల చొప్పున దేనికదే మెత్తగా దంచి, మూడింటినీ కలిపి తగినంత "ఉప్పు" కూడా చేర్చి, దాన్ని ఒక సీసాలో భద్రపరచుకోండి. "కూర్చిక"ను తాగినప్పుడల్లా, అందులో దీన్ని ఒక చెంచా మోతాదులో కలిపి తాగండి. చవడదెబ్బ కొట్టదు. పేగులకు బలాన్నిస్తుంది. జీర్ణకోశ వ్యాధులన్నింటికీ ఇది మేలు చేస్తుంది. వేసవిలో కలిగే జలుబుని నివారిస్తుందిచ.

**వడదెబ్బ కొట్టని పానీయం "రసాల":**
పెరుగు మీద తేరుకున్న నీళ్ళు, పాలు కలగలిపి ఆరోగ్యకరమైన "రసాల" అనే పానీయాన్ని "భీముడు" తయారు చేశాడని "భావప్రకాశ" వైద్య గ్రంథంలో ఉంది. అరణ్యవాసంలో ఉన్నప్పుడు, పాండవుల దగ్గరకు శ్రీ కృష్ణుడు వస్తే, భీముడు స్వయంగా దీన్ని తయారు చేసి వడ్డించాడట! ఇది దప్పికని పోగొట్టి వడదెబ్బ తగలకుండా చేస్తుంది కాబట్టి, ఎండలో తిరిగి ఇంటికి వచ్చిన వారికి ఇచ్చే పానీయం ఇది. తన ఆశ్రమాన్ని సందర్శించటానికి శ్రీరాముడు వచ్చినప్పుడు భరద్వాజ మహర్షి రాముని గౌరవార్థం ఇచ్చిన విందులో రసాల కూడా ఉంది. భావ ప్రకాశ వైద్య గ్రంథంలో దీన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరంగా ఇచ్చారు:

1. బాగా కడిగిన ఒక చిన్న కుండ లేదా ముంత తీసుకోండి. దాని మూతిని మూస్తూ ఒక పలుచని వస్త్రాన్ని రెండుమూడు పొరల మీద వాసెన (ఆవిరిపోక యెసటికుండ మూతిమూసి కట్టిన గుడ్డ) కట్టండి. ఒక కప్పు పలుచని పెరుగులో అరకప్పు "పంచదార" కలిపి, ఈ మిశ్రమాన్ని "చల్లకవ్వం"తో బాగా చిలికి ఆ వాసెన మీద పోసి వడకట్టండి.

2. పెరుగులో పంచదార కరిగి నీరై ఆ వస్త్రంలోంచి క్రింది ముంతలోకి దిగిపోతాయి. వాసెనమీద పొడిగా పెరుగు ముద్ద మిగిలి ఉంటుంది. దాన్ని అన్నంలో పెరుగు లాగా అవాడుకోండి. ఈ రసాల కు దానితో పని లేదు. ముంతలో మిగిలిన తియ్యని పెరుగు నీటిని 'ద్రవ్యం' అంటారు. ఈ 'ద్రవ్యం' నిండా లాక్టోబాసిల్లస్ అనే ఉపకారక సూక్ష్మజీవు లు ఉంటాయి. అవి పేగుల్ని సంరక్షించి జీర్ణాశయాన్ని బలసంపన్నం చేస్తాయి. ఆ నీటితోనే రసాలను తయారు చేస్తారు

3. ఇప్పుడు, కాచి చల్లార్చిన పాలు ఈ ద్రవ్యానికి రెట్టింపు కొలతలో తీసుకొని ముంతలోని పెరుగు నీళ్ళతో కలపండి. చల్లకవ్వంతో ఈ మిశ్రమాన్ని చక్కగా చిలికి, అందులో "ఏలకుల" పొడి, "లవంగాల" పొడి, కొద్దిగా "పచ్చకర్పూరం", "మిరియాల" పొడి కలపండి. ఈ కమ్మని పానీయమే రసాల! చదీన్ని అప్పటికప్పుడు తాగేలాగా తయారు చేసుకోవాలి.

4. ఈ వడగట్టే ప్రక్రియకు బదులుగా, పెరుగు లేదా మజ్జిగ మీద తేరుకొన్న తేటని తీసుకొని, సమానంగా పాలు కలిపి చిలికి తయారు చేసుకొవచ్చు కూడా! "శొంఠి", "మిరియాలు", "ధనియాలు", "జీలకర్ర", "లవంగాలు", చాలా స్వల్పంగా "పచ్చకర్పూరం" వీటన్నింటిని మెత్తగా దంచిన పొడిని కొద్దిగా ఈ "రసాల"లో కలుపుకొని త్రాగితే ఎక్కువ ప్రయోజనాత్మకంగా ఉంటుంది.

5. మజ్జిగ మీద తేటలో కేవలం ఉపయోగకారక సూక్ష్మజివులు లాక్టోబాసిల్లై మాత్రమే ఉంటాయి. ఈ సూక్ష్మజీవుల కారణంగానే పాలకన్నా పెరుగు, పెరుగు కన్నా చిలికిన మజ్జిగ ఎక్కువ ఆరోగ్య దాయకమైనవిగా ఉంటాయి. మజ్జిగలొని లాక్టోబాసిల్లై ని తెచ్చి పాలలో కలిపి, చిలికి ఈ రసాల ప్రయోగాన్ని మన పూర్వీకులు చేశారన్నమాట.

ఇది "అమీబియాసిస్" వ్యాధి, "పేగుపూత", "రక్త విరేచనాలు", "కలరా" వ్యాధులు ఉన్నవారిక్కూడా ఇవ్వదగిన పానీయం. వేసవి కాలానికి అనుకూలంగా ఉంటుంది. వడ దెబ్బ తగలనీయదు. శరీరంలో వేడిని తగ్గిస్తుంది. తక్షణం శక్తినిస్తుంది. "కామెర్ల" వ్యాధిలో ఎక్కువ మేలు చేస్తుంది. పెరుగు మీద తేట, వైద్యపరంగా, చెవులను బలసంపన్నం చేస్తుందని "ఆయుర్వేద శాస్త్రం" చెప్తోంది. "చెవిలో హోరు(టినిటస్)", చెవులలో తేడాల వలన కలిగే తలతిరుగుడు "(వెర్టిగో)" లాంటి వ్యాధులకు ఇది గొప్ప ఔషధం గా పని చేస్తుందన్నమాట.

**వేసవి కోసం "తేమనం" అనే పానీయం:**
తేమనం అనేది శ్రీనాథుడి కాలం వరకూ ప్రసిద్ధి చెందిన వంటకమే! దీన్ని "తీపి"గానూ, "కారం"గానూ రెండు రకాలుగా తయారు చేసుకొంటారు. "మజ్జిగ"లో "పాలు", "బెల్లం" తగినంత చేర్చి, ఒక పొంగు వచ్చే వరకూ కాస్తే "తేమనం" అనే తెలుగు పానీయం తయారౌతుంది. చఇది వేసవి పానీయాలలో మేలయిన పానీయం. వడదెబ్బ వలన కలిగే శోషని నివారిస్తుంది. శరీరానికి తక్షణ శక్తినిస్తుంది. చల్లారిన తరువాత త్రాగటం మంచిది. దీన్ని "తీపి మజ్జిగ పులుసు" అనవచ్చు. ఇంక "కారం" మజ్జిగపులుసు గురించి మనకు తెలిసినదే! పులవని "చిక్కని మజ్జిగ" తీసుకోండి. వెన్న తీసిన మజ్జిగ అయితే మరింత రుచికరంగా ఉంటాయి. ఈ మజ్జిగలో "అల్లం", "మిర్చి", "కొత్తిమీర", ఇతర సంబారాలు (ఆహారపదార్థములలో అవసరము నుబట్టి రుచిని, పరిమళమును, ఆహారయోగ్యతను ఎక్కువ చేయుటకు చేర్చబడుచుండు వస్తువులు [Spices and condi-ments] వేసి కాచిన మజ్జిగ పులుసు బాగా చలవ చేస్తుంది. మజ్జిగ పులుసు వేసవి కోసం తరచూ వండుకొవాల్సిన వంటకం అని గుర్తించండి!


ఉత్తర రామ చరితంలో "గారెలు బూరెలు చారులు మోరెలు" అనే ప్రయోగాన్ని బట్టి, ఈ మజ్జిగ పులుసుని 'మోరు' అని పిలిచేవారని తెలుస్తోంది. "బియ్యప్పిండి", "అల్లం" తదితర సంబారాలు చేర్చి ఉండలు కట్టి మజ్జిగ పులుసులో వేసి వండుతారు. ఈ ఉండల్ని 'మోరుండలు' అంటారు. వీటిని ఆవడ(పెరుగువడ)లాగా తినవచ్చు. పర్షియన్లు ఇష్టంగా వండుకొనే Cacik అనే మజ్జిగ పులుసులో వెల్లుల్లి మషాలా బాగా కలిపి, రొట్టెల్లో నంజుకొంటారు కూడా!

**మెంతి మజ్జిగ :** మెంతులు తేలికగా నూరి చిక్కని పులవని మజ్జిగలో కలిపి, తాలింపు పెడితే, దాన్ని "మెంతి మజ్జిగ" అంటారు. "మజ్జిగ చారు" అని కూడ పిలుస్తారు. తెలుగిళ్ళలో ఇది ప్రసిద్ధ వంటకం. దీన్ని అన్నంలో ఆధరవుగానూ తినవచ్చు లేదా విడిగా తాగావచ్చు కూడా! మామూలు మజ్జిగకన్నా అనునిత్యం మజ్జిగచారునే వాడుకోవటం ఎప్పటికీ మంచిది. చముఖ్యంగా షుగర్ వ్యాధి ఉన్నవారికీ, వచ్చే అవకాశం ఉన్నవారికి ఇది మంచి చేస్తుంది. **తీపి లస్సీ :** మజ్జిగలో "పంచదార" లేదా "తేనె" కలిపిన పానీయమే లస్సీ! హిందీ లేదా పంజాబి పదం కావచ్చు. వేసవికాలంలో "నిమ్మరస"ం, "జీలకర్ర" పొడి, "ఉప్పు", "పంచదార" కలిపి "పుదీనా ఆకులు" వేసిన లస్సీ చవడ దెబ్బ తగలకుండా కాపాడుతుందిచ. తెలుగులో దీన్ని 'సిగరి' అంటారు. శిఖరిణి అనే సంస్కృత పదానికి ఇది తెలుగు రూపం కావచ్చు. చిక్కని మజ్జిగ అయితే "లస్సీ" అనీ, వెన్న తీసేసి, నీళ్ళు ఎక్కువ కలిపితే ""చాస్"" అనీ పిలుస్తారు. టర్కీలో Ayran, ఆర్మీనియాలో Than, పర్షియాలో Doogh, ఆల్బేనియాలో Dhalle అనే పానీయాలు ఇలాంటివే! గుర్రం పాలతో kumiss అనే పానీయాన్ని మధ్య ఆసియా స్టెప్పీలు ఇష్టంగా తాగుతారట! పర్షియన్ Cacik అనేది మన మజ్జిగ పులుసు లాంటిదే!

**మజ్జిగమీద తేట :** మజ్జిగమీద తేటకు మజ్జిగతో సమానమైన గుణాలున్నాయి. చిలికిన మజ్జిగని ఒక గిన్నెలో సగానికి పోసి మూడొంతుల వరకూ నీళ్ళు కలిపి రెండు గంటలు కదల్చకుండా ఉంచండి. మజ్జిగమీద ఆ నీరు తేరుకొంటుంది. మజ్జిగ తేటను వంచుకొని మళ్ళీ నీళ్ళు పోయండి. ఇలా ప్రతి రెండు మూడు గంటలకొకసారి మజ్జిగనీళ్ళు వంచుకొని వేసవి కాలం అంతా మంచి నీళ్ళకు బదులుగా ఈ మజ్జిగ నీళ్ళు తాగుతూ ఉండండి వడదెబ్బ కొట్టదుగాక కొట్టదు. మజ్జిగ వాడకం మనకున్నంతగా ఉత్తరాది వారికి లేదు. మధురానగరిలో తెలుగు కృష్ణుడు చల్లలమ్మబోయే అమ్మాయిల దారికి అడ్డం పడ్డాడు గానీ, పెరుగులమ్మబోయే వారికి కాదు గదా!

# మీ మెడ, వెన్నునొప్పి మిమ్మల్ని చంపేస్తున్నాయా?

## ఈ వ్యాయామాలను ప్రయత్నించండి




ఇంటి నుండి పనిచేసేటప్పుడు ఆఫీసులో ఉన్నంత కంఫర్ట్ గా ఉండదు. మీ మెడలో మరియు వెన్నెముక వెనుక భాగంలో అక్షరాలా నొప్పిగా ఉంటుందని నిరూపించబడినది, ఎందుకంటే మీ కోసం అనువైన కార్యస్థలాన్ని కనుగొనలేకపోవచ్చు. మెడ మరియు వెనుక భాగంలో నొప్పిని తగ్గించడానికి ఈ వ్యాయా మాలను ప్రయత్నించండి.

మీ ల్యాప్‌టాప్ ముందు హంచ్ చేసిన ఈ కథనాన్ని చదువుతున్న వారిలో మీరు ఒకరు అయితే, మీ భంగిమను నిఠారుగా ఉంచడానికి ఇక్కడ సున్నితమైన రిమైండర్ ఉంది. కొంతమందికి ఇంటి స్థలం నుండి ఎర్గోనామిక్ పని ఉండగా, మరికొందరు అందుబాటులో ఉన్న స్థలాన్ని ఉపయోగించుకుంటారు – పడకగది నుండి డైనింగ్ టేబుల్స్, మంచాలు మరియు కాఫీ టేబుల్స్ వరకు ఇలా అన్నింటిని ఆఫీస్ పనికోసం వాడేసుకుంటున్నారు. ఇంటి నుండి పని చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ – కొన్ని సందర్భాల్లో సౌకర్యవంతమైన గంటలు, అన్ని సందర్భాల్లో ట్రాఫిక్ ఉండదు, ప్రతిరోజూ పని కోసం దుస్తులు ధరించడం గురించి చింతించకండి మరియు వాటిలో సౌకర్యం చాలా ముఖ్యమైనది. కానీ ఇప్పుడు సౌకర్యం మీ మెడలో మరియు వెన్ను భాగంలో అక్షరాలా నొప్పిగా నిరూపించబడుతుంది, ఎందుకంటే మీరు ఖచ్చితమైన కుర్చీని కనుగొనలేకపోవచ్చు లేదా మీ కోసం అంకితమైన కార్యస్థలం కలిగి ఉండరు. స్ట్రెచ్చింగ్ వ్యాయామాలు ప్రతి ఒక్కరికీ సహేతుకంగా సురక్షితం అయినప్పటికీ అవి భారీ బరువులు లేదా ఓర్పు వ్యాయామాలను కలిగి ఉండవు. అయినప్పటికీ, మీ పరిమితులను తెలుసుకోవడం మంచిది మరియు స్ట్రెచ్చింగ్ తో సహా ఎలాంటి వ్యాయామం చేయకూడదని గుర్తుంచుకోండి. మెడ మీద గట్టిగా ఉబ్బడం, గొంతు వెనుక లేదా మణికట్టు నొప్పి నివారించడానికి, ఈ సాధారణ వ్యాయామాలను ప్రయత్నించండి:

**నెక్ రోల్**
మీ కంప్యూటర్ / ల్యాప్‌టాప్ సరిగా ఉంచకపోతే, అది మెడలో అక్షరాలా నొప్పిగా కలిగిస్తుంది. ఇది దీర్ఘకాలిక సమస్యలకు దారితీస్తుంది మరియు మెడ మాత్రమే కాదు– తలనొప్పి కూడా. పిసి సరైన స్థితిలో ఉంచబడిందని నిర్ధారించుకోవడమే కాకుండా, మీ మెడను ప్రతిసారీ కదిలించి, అది సరళంగా ఉండేలా చూసుకోవాలి.

మీ తలను మీకు సాధ్యమైనంతవరకు ముందుకు సాగండి (హాయిగా) మరియు మీ తల కొనతో ప్రారంభ స్థానానికి తిరిగి వచ్చే ముందు పూర్తి వృత్తం చేయండి. ప్రతిసారీ 3–5 సర్కిల్‌లు చేయండి. మీరు మీ మంచం మీద లేదా మీ బెడ్ మీద పనిచేస్తుంటే, మీరు మందగించే అవకాశం ఉంది, ఇది తీవ్రమైన వెన్నునొప్పికి దారితీస్తుంది. మీరు కూర్చున్న విధానం గురించి జాగ్రత్తగా ఉండటం వల్ల ఎగువ వెన్నునొప్పిని త్వరగా తగ్గించవచ్చు. మీ భుజాలను పైకి ఎత్తండి – మీరు ఎవరికైనా హగ్ ఇస్తున్నట్లు. ఇప్పుడు, నెమ్మదిగా మీ భుజాలను వెనుకకు మరియు చుట్టూ తిప్పండి, వాటిని ప్రతి దిశలో గరిష్ట స్థానానికి నెట్టండి. 3–5 సర్కిల్‌లు చేయండి, ఆపై దిశను మార్చండి మరియు 3–5 సార్లు భుజాలను ముందుకు తిప్పండి.

# చీకాకు పెట్టే జుట్టు సమస్యలకు మేలైన చికిత్స



పొడవాటి జుట్టు లేదా అందమైన బన్ను తయారు చేయడానికి మీ జుట్టును ఆరోగ్యంగా ఉంచడం ముఖ్యం. ఈ జీవనశైలి కారణంగా, మీ జుట్టు పొడి లేదా జిడ్డుగల చర్మం, చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలను ఎదుర్కొంటుంది. పొడి జుట్టు చాలా చికాకు కలిగిస్తుంది. మీ జుట్టు చాలా నిర్జీవంగా కనిపించడమే కాదు, జుట్టు మసకబార డానికి కూడా కారణం అవుతుంది. చాలా తరచుగా, శీతాకాలంలో, వేసవి కాలంలో ఈ పొడితనం చాలా పెరుగుతుంది. అందువల్ల, పొడి జుట్టుతో పండ్లను ప్యాక్ చేయడం మంచి పరిష్కారం. మీరు ఎల్లప్పుడూ మార్కెట్లో అందుబాటులో ఉన్న ఏదైనా రెడీమేడ్ హెయిర్ ప్యాక్‌ని ఉపయోగించవచ్చు. అయితే, ఇందులో ఉపయోగించే రసాయనాలు మీ జుట్టు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. కాబట్టి, పొడి జుట్టు నివారించడానికి పండ్లతో హెయిర్ ప్యాక్ ప్రయత్నించండి. అధిక ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, అనేక అంశాలు పొడి జుట్టు సమస్యకు దోహదం చేస్తాయి. కాబట్టి, ఆరోగ్యకరమైన జుట్టు కోసం కొన్ని పండ్లతో నిండిన హెయిర్ ప్యాక్‌లను వాడండి. ఇది మార్కెట్లో లభించే అత్యంత ఖరీదైన హెయిర్ ప్యాక్ కంటే చాలా మంచిది. ఈ పండ్ల నుండి తయారైన హెయిర్ ప్యాక్‌లు జుట్టుకు సహజమైన షైన్‌ని తీసుకురావడం ఖాయం. ఈ పండ్లను ప్యాక్ పొడి జుట్టుకి ఉపయోగించి తర్వాత వచ్చిన మార్పును గమనించండి. జుట్టు అందాన్ని పెంచే రహస్యం ఈ క్రింది పండ్లలో దాగున్నాయి..!

**బనానాస్** పొడి నెత్తికి అరటి ప్యాక్ వాడండి. పొడి నెత్తికి ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును పిండి, గుడ్డులోని తెల్లసొనతో బాగా కలపాలి. చర్మం మరియు జుట్టును బాగా వర్తించండి. దీన్ని 15–20 నిమిషాలు అలాగే ఉంచి బాగా కడగాలి.

**ఆపిల్** ఆపిల్ పొడి చర్మం కోసం మరో అద్భుతమైన హెయిర్ ప్యాక్. షాంపూ చేసిన తరువాత, ఆపిల్ రసాన్ని కండీషనర్‌గా ఉపయోగించవచ్చు. విటమిన్ సి ఉన్న ఆపిల్ మీ జుట్టును మృదువుగా, మెరిసేలా చేస్తుంది.

**లైమ్ ఫ్రూట్** పొడి నెత్తికి ఇది ఉత్తమమైన ఫ్రూట్ ప్యాక్లలో ఒకటి. నిమ్మరసంతో నెత్తిమీద నేరుగా రుద్దండి లేదా పెరుగు,తేనెతో నిమ్మరసం కలపండి.

**బొప్పాయి** ఇది తల పొడిబారడాన్ని తగ్గిస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. మెత్తని బొప్పాయిని పాలు, తేనెతో కలపండి. మీ జుట్టును బ్రష్ చేయండి. మీ జుట్టును ప్రకాశవంతం చేయడానికి ఈ పద్ధతి క్రమం తప్పకుండా చేయవచ్చు.

**దోసకాయలు** మీరు క్రమం తప్పకుండా ఈత కొడుతుంటే, నీటిలోని క్లోరిన్ మీ జుట్టును పొడిగా ఉంచుతుంది. తరిగిన దోసకాయ, ఒక టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్, గుడ్డు యొక్క తెల్లని భాగాన్ని కలపండి. దీన్ని 15 నిమిషాలు అలాగే ఉంచి శుభ్రం చేయండి. **పీచ్ పండ్లు** పీచు బెర్రీలు ఎంత ఉపయోగకరంగా ఉన్నాయో మీకు తెలుసా? పీచు పండ్లను పిండి, మొజారెల్లాకు జోడించండి. ఈ పేస్ట్‌ను మీ నెత్తిమీద మొత్తం వైపు మెత్తగా పూయండి. వాటిని సరిగ్గా కడగాలి. ఇలా చేయడం ద్వారా మీరు ఖచ్చితంగా మీ జుట్టులో మార్పులను గమనించవచ్చు.

**కొబ్బరికాయలు**
మీరు వీటిని నేరుగా ఉపయోగించలేరు. కొబ్బరి నూనె లేదా కొబ్బరి పాలు మాత్రమే వాడండి. కొబ్బరి మీ నెత్తిలోని తేమను ఉంచడానికి సహాయపడుతుంది. మళ్ళీ తేమను కోల్పోకుండా సహాయపడుతుంది.

## శరీర బరువు తగ్గాలంటే

# ఈ ఆహారాలను తినడం మానేయండి

నాలుక రుచి మొగ్గలను ఆకర్షించే అనేక వింతైన వంటకాలు కనుగొనబడ్డాయి. కాబట్టి నాలుకకు రుచి చూపకుండా అణిచివేయడం కొంచెం కష్టం. మీరు ఆహార ప్రేమికులైతే, మీరు నాలుకను నియంత్రించలేరు. ఈ రోజు చాలా మంది స్థూలకాయానికి ముఖ్య కారణం ఆహారం, జీవన విధానం.ఎందుకంటే ప్రస్తుత జీవన శైలిలో ఎన్నో మార్పులు, చాలా మంది ప్రజలు ఒకే స్థలంలో ఎక్కువ సమయం కూర్చొని పనిచేస్తున్నందున, ఆహారంలో ఉన్న కొవ్వులు శరీరానికి తగినంత పని లభించకుండా ఆ స్థానం లో ఉంటాయి.ఫలితంగా, చాలా మంది ఊబకాయం, బొడ్డు సమస్యలతో బాధపడుతున్నారు.ఇప్పుడు బొజ్జ, ఊబ కాయంను వెంటనే నివారించడానికి ఆహారాలను చూద్దాం.





**ఫ్రెంచ్ ఫ్రైస్,బంగాళాదుంప చిప్స్**
బంగాళాదుంపలు అందరికీ ఇష్టమైన కూరగాయ. వీటిని సన్నగా పొడుగ్గా ముక్కలు చేసి చాలా సార్లు ఉడికించి తినవచ్చు. బంగాళాదుంపలతో అత్యంత వినూత్నమైన అల్పాహారాలలో ఒకటి ఫ్రెంచ్ ఫ్రైస్ , బంగాళాదుంప చిప్స్. ఇది పూర్తిగా నూనెలో వేయించినందున, ఇందులో కొవ్వులు చాలా పుష్కలంగా ఉంటాయి. ఎవరైనా దీన్ని ఎక్కువగా తీసుకుంటే అది ఊబకాయానికి కారణమవు తుంది. కాబట్టి బరువు తగ్గాలని చూస్తున్న వారికి, తప్పించుకోవలసిన మొదటి ఆహారాలలో ఒకటి ఫ్రెంచ్ ఫ్రై మరియు బంగాళాదుంప చిప్స్.

**చక్కెర మిశ్రమ,కార్బోనేటేడ్ పానీయాలు**
పానీయం చక్కెరతో కలిపినప్పుడల్లా, ఆ పానీయం అనారోగ్యకరమైన పానీయం. చక్కెర అనేది ఒకరి శరీర బరువు , ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపే పదార్థం. కాబట్టి ఊబకాయంతో బాధపడేవారు చక్కెర పానీయాలకు దూరంగా ఉండాలి. అలాగే, కార్బోనేటేడ్ పానీయాలను తాకవద్దు.

**ఐస్ క్రీం**
చక్కెరలో ఐస్ క్రీం అధికంగా ఉంటుంది. ఇది ఒకరి శరీర బరువును పెంచే ఆహార పదార్థం కూడా. మీకు ఐస్ క్రీం తినాలని కోరిక ఉంటే, ఇంట్లో ఐస్ క్రీం తయారు చేయడానికి ప్రయత్నించండి. దీన్ని పరిమాణంలో తినాలి.

**పిజ్జా**
పిజ్జా ఇప్పుడు చాలా మంది ప్రజలు వండడానికి, ఆర్డర్ చేయడానికి చా లా సోమరి అయిన ఆహార పదార్థం. దుకాణాలలో తయారు చేయబడిన ,విక్రయించే పిజ్జా బాగా శుద్ధి చేయ బడింది. ప్రాసెస్ చేసిన పదార్థా లను కలిగి ఉంటుంది. కాబట్టి వీటిని నివారించడం మంచిది.
మీరు ఇంట్లో పిజ్జా తయారు చేయగలరు కాబట్టి, దుకాణాల్లో ఎందుకు కొనాలి? ఇంట్లో తయారు చేసిన పిజ్జా గొప్ప పరిష్కారం, ఎందుకంటే దీనిని ఆరోగ్యకరమైన పదార్థాలతో తయారు చేయవచ్చు.

**కాఫీ**
కాఫీలోని బ్లాక్ కాఫీ ఆరోగ్యకరమైన ఎంపిక. ఇతర రకాల కాఫీ పానీయాలలో కృత్రిమ పదార్థాలు ఉన్నాయి. అవి అనారోగ్యకరమైనవి. కొవ్వుతో నిండి ఉన్నాయి.

**వైట్ బ్రెడ్**
తెల్ల రొట్టె పూర్తిగా మైదాతో తయారు చేయబడింది. మీరు ఎక్కువ రొట్టెలు తింటే, అది మీ రక్తంలో చక్కెరను పెంచుతుంది. మీరు చాలా ఆకలితో ఉంటే, మీరు తెల్ల రొట్టె తినడానికి బదులు మరికొన్ని మంచి ఆహారాన్ని తినవచ్చు.

గ్రానోలా బార్లు
ఈ రకమైన బార్లు చాలా అనారోగ్యకరమైనవి. దీనికి కారణం చక్కెర, శుద్ధి చేసిన పిండి, నూనెలు. అదనంగా, ఇందులో కేలరీలు అధికంగా ఉంటాయి.

వీటితో మీ కడుపు నింపడం మంచిది కాదు. బహుశా మీరు స్నాక్స్ వద్ద ఏదైనా తినాలని చూస్తున్నట్లయితే, పండు లేదా నట్స్ తినండి.

**జ్యూస్**
అనేక వినూత్న రసాలను ప్రస్తుతం మార్కెట్లో విక్రయిస్తున్నారు. ప్యాకెట్లలో ప్యాక్ చేసిన రసాలలో కేలరీలు అధికంగా ఉంటాయి. చక్కెర పుష్కలంగా ఉంటుంది. ఆ రకమైన రసాలలో ఫైబర్ ఉండదు. కాబట్టి ఈ రకమైన రసాలను త్రాగడానికి బదులుగా, పండు తినడం మంచిది.

**కేక్, మిఠాయి, కుకీ**
ఈ రకాలు చక్కెర, శుద్ధి చేసిన పిండి మరియు నూనెతో క్రీముగా ఉంటాయి. వాటిలో పోషకాలు ఉండవు. కానీ ఇందులో కేలరీలు అధికంగా ఉంటాయి. ఒకరు ఎక్కువగా తింటే అది ఊబకాయానికి దారితీస్తుంది.

**వైన్**
మద్యపానం తీసుకోని పురుషులను చూడటం చాలా అరుదు. కానీ మీరు మీ బొజ్జ ఊబకాయం తగ్గించాలని ఆలోచిస్తుంటే, మద్యపానం మానేయండి. ముఖ్యంగా బీరు తాగవద్దు. ఇది బొజ్జ పరిమాణాన్ని మాత్రమే పెంచుతుంది.

## ఇవి క్లిక్ అయితే... నారా హీరో ఫుల్ బిజీనే



ఏమాత్రం సినీ నేపథ్యం లేని నారా కుటుంబం నుంచి ఫిలిం ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు రోహిత్. నారా అంటే పక్కా పొలిటికల్ ఫ్యామిలీ అనే గుర్తింపు ఉండగా.. రోహిత్ మాత్రం సినీ రంగాన్ని ఎంచుకున్నాడు. తొలి చిత్రం 'బాణం'తోనే తన ప్రతిభను చాటుకున్న అతను.. ఆ తర్వాత వైవిధ్యమైన సినిమాలతో మంచి గుర్తింపే సంపాదించాడు. కానీ కొన్నేళ్లు ఫుల్ బిజీగా ఉన్న అతను.. సడెన్‌గా ఇండస్ట్రీ నుంచి మాయం అయిపోయాడు. తెలుగుదేశం పార్టీ 2019 ఎన్నికల్లో అధికారం కోల్పోయాక అతను కనిపించకుండా పోవడంతో పొలిటికల్ బ్యాకప్‌తోనే అతను సినిమాలు చేయగలుగుతున్నాడనే అభిప్రాయాలు వినిపించాయి. అందుకు తగ్గట్లే 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోహిత్ సినిమాల్లో యాక్టివ్ అయ్యాడు. గత ఏడాది 'సుందరకాండ' అనే చిత్రంతో పలకరించిన రోహిత్‌కు ఆశించిన ఫలితం దక్కలేదు. ఇటీవలే చినిమల్లి మణికుమార్ అనే కొత్త దర్శకుడితో ఒక సినిమాను మొదలుపెట్టాడు రోహిత్. ఐతే హీరోగా ముమ్ముందు ఎన్ని సినిమాలు చేస్తాడో కానీ.. రోహిత్ క్యారెక్టర్ ఆర్టిస్టుగా బిజీ అయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆల్రెడీ త్రివిక్రమ్ దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో రోహిత్ ఒక కీలక పాత్ర చేస్తున్న సంగతి తెలిసిందే. అది పాజిటివ్ క్యారెక్టరా.. నెగెటివా అన్నది వెల్లడి కాలేదు. ఇంతలోనే ఇప్పుడు మరో సీనియర్ హీరో సినిమాలో స్పెషల్ రోల్‌కు రోహిత్ రెడీ అవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

మెగాస్టార్ చిరంజీవి హీరోగా బాబీ కొల్లి రూపొందించబోతున్న చిత్రంలో రోహిత్ కోసం ఒక ప్రత్యేక పాత్రను డిజైన్ చేశారట. చిరు సినిమాలో నారా రోహిత్ నటించడం ప్రేక్షకులకు కచ్చితంగా ఒక సర్ప్రైజే. రోహిత్ గతంలోనూ 'సారొచ్చారు' లాంటి చిత్రాల్లో క్యామియో రోల్స్ చేశాడు కానీ.. వెంకీ, చిరు లాంటి పెద్ద హీరోల సినిమాల్లో ప్రత్యేక పాత్రలు చేయడం తన కెరీర్‌లో కచ్చితంగా ఒక మలుపే. ఈ పాత్రలు క్లిక్ అయితే క్యారెక్టర్, విలన్ పాత్రలతో అతను బిజీ అయిపోయే అవకాశముంది.

## మంగాపురం వైపు దృష్టి మళ్లుతోంది



ఘట్టమేనేని ఫ్యామిలీ నుంచి మూడో తరం వారసుడిగా ఇండస్ట్రీలో అడుగు పెడుతున్న జయకృష్ణ మొదటి సినిమా శ్రీనివాస మంగాపురం షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు రెడీ అవుతోంది. ఇప్పటికే టీజర్, ఒక పాట వచ్చేయగా సూపర్ స్టార్ స్వర్గీయ కృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఒక యాక్షన్ కట్ రిలీజ్ చేశారు. నిన్న జరిగిన ఈవెంట్ లో అశ్వినీదత్, రాఘవేంద్రరావు, కిరణ్, తమ్మారెడ్డి భరద్వాజ లాంటి సీనియర్ల హాజరులో కుర్రాడిని ఘనంగా ప్రేక్షకులకు పరిచయం చేశారు. బాబాయ్ మహేష్ బాబు అభిమానుల అండ ఎంత అవసరమో జయకృష్ణ బృందానికి తెలియంది కాదు. తండ్రి రమేష్ బాబు కూడా ఒకప్పుడు హీరోనే అయినప్పటికీ కెరీర్ ఎక్కువ కాలం కొనసాగలేదు. ఆయన చనిపోయిన తర్వాత కొడుకు రూపంలో తీరని కలను ఇలా నెరవేరుస్తాడని కుటుంబం బోలెడు ఆశలు పెట్టుకుంది. దానికి తగ్గట్టే జయకృష్ణ లుక్స్ లో మంచి అందంగా కనిపించడమే కాదు నటన పరంగా శిక్షణ తీసుకున్న వైనం విజువల్స్ లో కనిపిస్తోంది. శ్రీనివాస మంగాపురం దర్శకుడు అజయ్ భూపతి. ఆరెక్స్ 100 తర్వాత మహా సముద్రం నిరాశపరిచిన మంగళవారంతో తిరిగి తన ఉనికిని కొంత మేర చాటుకోగలిగాడు. ఇప్పుడు కీలకమైన జయకృష్ణ డెబ్యూని తన చేతుల్లో పెట్టారు. సీనియర్ హీరోయిన్ రవీనాటాండన్ కూతురు రషా తదాని ఈ మూవీతో టాలీవుడ్ కు పరిచయమవుతోంది. తన తల్లి తెలుగులో బంగారు బుల్లోడు, రథసారధి, ఆకాశవీధిలో లాంటి చెప్పుకోదగ్గ సినిమాలు కొన్ని చేసింది. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఇందులో ఒక కీలక పాత్ర పోషించడం మరో విశేషం. జివి ప్రకాష్ కుమార్ సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. జయకృష్ణ కనక మొదటి సినిమాతో సక్సెస్ అందుకుంటే అవకాశాలు క్యూ కడతాయి. సుధీర్ బాబు విషయంలో జరిగిన పొరపాట్లు రిపీట్ కాకుండా కథల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే చాలు. ఎలాగూ బాబాయ్ గైడెన్స్ ఉంటుంది కాబట్టి కెరీర్ ని సరైన దిశగా ప్లాన్ చేసుకుంటే చాలు వరసగా సినిమాలు చేసుకోవచ్చు




## టాలీవుడ్ అంటే రెహ్మాన్ కు ఇంత ప్రేమ ఉందా



ఇండియా గర్వించదగ్గ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్. తమిళ సినిమా ప్రయాణం మొదలుపెట్టి రెండు ఆస్కార్ అవార్డులు గెలిచే స్థాయికి ఎదిగిన గ్లోబల్ మ్యూజిక్ డైరెక్టర్ ఆయన. దేశ సినీ సంగీత చరిత్రలోనే నంబర్ వన్ స్థానానికి ఆయన గట్టి పోటీదారు. అలాంటి లెజెండరీ సంగీత దర్శకుడు.. టాలీవుడ్ హీరో రామ్ చరణ్ గురించి, తెలుగు సినీ పరిశ్రమ గురించి చెన్నైలో జరిగిన పెద్ది ప్రమోషనల్ ప్రెస్ మీట్లో చాలా గొప్పగా మాట్లాడాడు. చిరంజీవి ఒక పెద్ద లెజెండ్ అని, ఎంతో సాధించిన అలాంటి వ్యక్తి కొడుగ్గా ఇండస్ట్రీలోకి వచ్చి తనకంటూ సొంత పేరు సంపాదించుకోవడం అంత తేలికైన విషయం కాదని, అది రామ్ చరణ్ సాధించాడని, తండ్రిని మించిన తనయుడు అనిపించుకున్నాడని రెహమాన్ కొనియాడాడు. తనకూ ఒక కొడుకు ఉన్నాడని, అతను రామ్ చరణ్‌ను స్ఫూర్తిగా తీసుకుని తనను మించి ఎదగాలని కోరుకుంటున్నానని రెహమాన్ వ్యాఖ్యానించాడు. ఇక తెలుగు సినీ పరిశ్రమ గురించి కూడా రెహమాన్ చాలా గొప్పగా మాట్లాడాడు. ఈ మధ్య తెలుగు సినిమా ఎంతో ఎదిగిందని.. ఆర్టిస్టులు, టెక్నీషియన్లు కలిసి అద్భుతాలు చేస్తున్నారని.. ఇలాంటి ఇండస్ట్రీలో తాను కూడా భాగం కావడం ఎంతో గొప్పగా అనిపిస్తోందని రెహమాన్ వ్యాఖ్యానించాడు. ఇక్కడ ఇంతకుముందే సినిమాలు చేసినప్పటికీ.. పెద్ది తనకు తొలి తెలుగు సినిమాలా అనిపిస్తోందని రెహమాన్ వ్యాఖ్యానించాడు. టాలీవుడ్ సంగీత దర్శకులు తనను ఇన్‌స్పిరేషన్‌గా చెబుతుంటారని.. కానీ తాను కీరవాణి, దేవిశ్రీ ప్రసాద్, తమన్ లాంటి వాళ్ల నుంచి స్ఫూర్తి పొందుతున్నానని రెహమాన్ వినమ్రంగా వ్యాఖ్యానించడం విశేషం. తాను వరుసగా కొంచెం భిన్నమైన, ప్రయోగాత్మక చిత్రలే చేస్తున్న సమయంలో.. సుకుమార్ సిఫారసు ద్వారా బుచ్చిబాబు వచ్చి తనను కలిశాడని, అతను చెప్పిన కథ నచ్చి మనమూ ఒక కమర్షియల్ సినిమా చేద్దాం అనిపించి పెద్ది సినిమాకు పని చేశానని రెహమాన్ తెలిపాడు. బుచ్చిబాబు గొప్ప దర్శకుడని, తనకెంతో నచ్చిన వ్యక్తి అని ఈ సందర్భంగా రెహమాన్ కొనియాడాడు.

## రామ్ చరణ్ చేతిలో 7 చీలికలు



తన సినిమాల్లో పాత్రల కోసం శారీరకంగా ఎంత కష్టానికైనా వెనుకాడని కథానాయకుడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. ధృవ, ఆర్ఆర్ఆర్ లాంటి సినిమాల కోసం అతనెంత శ్రమించాడో, ఎంత అద్భుతంగా లుక్‌ను మార్చుకున్నాడో తెలిసిందే. ఇప్పుడు తన నుంచి రాబోయే 'పెద్ది' కోసం కూడా ఎంత కష్టపడ్డాడో ప్రోమోల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా ఇందులో కుస్తీ యోధుడి పాత్ర కోసం చరణ్ ఒళ్లు హూనం చేసుకునేలా కష్టపడ్డాడని, గాయాల పాలు కూడా అయ్యాడని టీం అంతా చెబుతోంది. కుస్తీ పోటీల సన్నివేశాల్లో భాగంగానే చేతిని దెబ్బ తీసుకుని రిస్ట్ బేస్‌తో కనిపిస్తున్నాడు. దాంతోనే ప్రమోషన్లలో కనిపిస్తున్నాడు. 'పెద్ది' షూటింగ్‌లో భాగంగా చెయ్యి బాగా దెబ్బ తిందని, దానికి సర్జరీ కూడా అవసరమని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. దీని గురించి ఒక ఇంటర్వ్యూలో సమాచారాన్ని పంచుకున్నాడు చరణ్. 'పెద్ది'లో కుస్తీ పోటీలకు సంబంధించిన సన్నివేశాలను 30 రోజుల పాటు చిత్రీకరించామని, ఆ సమయంలో మొదట్లోనే కొంచెం నొప్పి అనిపించిందని.. కానీ చేతికి ఏమైందో తెలుసుకోవడం కోసం ఎంఆర్ఐ స్కాన్ తీసి చూసుకునేందుకు తనకు భయం వేసిందని.. ఒక వేళ చీలిక (టియర్) ఉంటే షూట్ కొనసాగించలేం కదా అనిపించిందని చరణ్ చెప్పాడు. ఐతే మొదట్లో ఒక చిన్న చీలిక వచ్చి ఉంటుందని అనుకుంటే.. షూటింగ్ అంతా అయ్యాక స్కాన్ చూసుకుంటే ఏకంగా 7 చోట్ల చీలికలు ఉన్నట్లు తెలిసిందని చరణ్ తెలిపాడు. చేతికి సర్జరీ అవసరం అయిందని, కానీ ఇప్పుడు శస్త్రచికిత్స చేసుకుంటే ప్రమోషన్లకు దూరం కావాల్సి ఉంటుందని, అందుకే బ్రేస్ వేసుకుని మేనేజ్ చేస్తున్నానని.. సినిమా విడుదల తర్వాత సర్జరీ చేయించుకుంటానని చరణ్ తెలిపాడు. కుస్తీ పోటీల్లో రెజ్లర్లు చేతులు పట్టుకునే ఒకరినొకరు నెట్టుకుంటారన్న సంగతి తెలిసిందే. ప్రొఫెషనల్ రెజ్లర్లతో కలిసి సాధన చేయడం, చిత్రీకరణలో పాల్గొనడంతో చరణ్ చేతికి బాగానే గాయాలైనట్లు కనిపిస్తోంది.



# బిజినెస్ న్యూస్



## ఫిన్‌టెక్ రంగంలోకి ఎల్ఐసీ: సీఈఓ దొరైస్వామి




ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఫిన్‌టెక్ రంగంలోకి ప్రవేశించాలనుకుంటోంది. డిజిటల్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యూహాత్మక పెట్టుబడులు లేదా ఆర్గానిక్ మార్గంలో ఫిన్‌టెక్ విభాగాన్ని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కంపెనీ సీఈఓ, ఎండీ ఆర్ దొరైస్వామి తెలిపారు. ఆధునిక అవసరాలను తీర్చడానికి, నూతన ఆవిష్కరణల కోసం అటు ఫిన్‌టెక్, ఇటు ఇన్సురెన్స్‌టెక్ కంపెనీలతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు పీఐటీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశలపై మాట్లాడారు. కేవలం బీమా వ్యాపారమే కాకుండా దేశంలోనే అతిపెద్ద ఆర్థిక సంస్థగా ఎల్ఐసీ ఉందని, అనేక పెద్ద పెద్ద కంపెనీల్లో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిందన్నారు. పాలసీదారులకు మెరుగైన ప్రతిఫలం అందించే దుకు ప్రత్యేకమైన సంస్థల్లో వ్యూహాత్మక పెట్టుబడులకూ ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. డిజిటల్ టెక్నాలజీని ఎల్ఐసీ వేగంగా అందిపుచ్చుకుం టోందని చెప్పారు. తమ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా సొంతంగానే తమ బిజినెస్ అప్లికేషన్లను తయారు చేసుకుం టున్నామని వెల్లడించారు. అదే సమయంలో కొత్త కొత్త ప్లాట్‌ఫామ్‌లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఇతర ఐటీ సర్వీస్ ప్రొవైడర్లతోనూ కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఫిన్‌టెక్ రంగంలో పోటీలో నిలదొక్కుకోవాలంటే ఐటీ అప్లికేషన్‌లను ఆధునికీకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్ఐసీలో తదుపరి వాటాల విక్రయంపై ప్రశ్నించగా.. పబ్లిక్ షేర్‌హోల్డింగ్ పరిమితిని పెంచేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు.

## పసిడి కొనుగోలుదార్లలో మారుతున్న ధోరణి



పసిడి ధర అధిక స్థాయుల్లో కొనసాగుతుండటంతో కొత్త ఆభరణాలు కొనేందుకు పూర్తి మొత్తాన్ని వెచ్చించడానికి బదులు.. పాత వాటినే మార్చేసి, ఆ వచ్చిన డబ్బులకు మరికొంత కలిపి కొత్తవి తీసుకుందామనే ధోరణి ఇటీవల కొనుగోలుదార్లలో పెరుగుతోంది. పాత ఆభరణాలను మార్చి కొత్తవి తీసుకోవాలనే ఆలోచన ఇప్పటిదేమీ కాదు. అయితే ప్రజల్లో నెలకొన్న కొన్ని సందేహాలు, భయాల కారణంగా పసిడి ఆభరణాల మార్పిడి విషయంలో వాళ్లు వెనకడుగు వేస్తుంటారు. పసిడి స్వచ్ఛతను సరిగ్గా నిర్ధారిస్తారా? వేరొక నగల వ్యాపారి వద్ద కొన్న ఆభరణాలకు సరైన ధర ఇస్తారా? ఏవేవో రుసుముల పేరుతో ఛార్జీలు వేసి తుది విలువ తగ్గిస్తారా? అనే విషయాలపై ప్రజలు ఆందోళన చెందుతుంటారు. పాత ఆభరణాలను మార్చుకునే కుటుంబం అది నెక్లెస్ కావచ్చు లేదా ఏళ్ల పాటు దాచిపెట్టిన చిన్న, విరిగిన ముక్క కావచ్చు.. అందులోని ప్రతి గ్రాముకూ సహేతుక విలువను పొందాలనే కోరుకుంటుంది.

ఈ ఆలోచన సరైనదేనా? పసిడి ధర అధిక స్థాయుల్లో కొనసాగుతున్నప్పుడు.. పాత ఆభరణాలను మార్చి కొత్తవి తీసుకోవడం మంచి ఆలోచనేనా? అంటే అవుననే అభిప్రాయం వినిపిస్తోంది. ప్రస్తుత అధిక ధరల వద్ద కొత్త డిజైన్లతో కూడిన ఆభరణాల కొనుగోలు కోసం.. పాత ఆభరణాల విలువను ఉపయోగించుకోవడానికి బంగారం మార్పిడి ప్రజలకు వీలు కల్పిస్తుంది. ఇది కొనుగోలు ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఇప్పటికే ఉన్న పుత్తడి ఆస్తులను మరింత ఉపయోగకరంగా మారుస్తుంది. ఇది దేశానికి కూడా విస్తృత ప్రయోజనం చేకూరుస్తుంది. దేశం ప్రతి సంవత్సరం భారీ పరిమాణంలో బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్నందున, పాత ఆభరణాలను రీసైక్లింగ్ చేయడం, మార్పిడి చేసుకోవడం ద్వారా కొత్త దిగుమతులపై ఆధారపడటం తగ్గి, విదేశీ మారక నిల్వల వాడకాన్ని తగ్గిస్తుంది. దీనివల్ల పాత ఆభరణాల మార్పిడి అనేది కొనుగోలుదార్లకు భారాన్ని తగ్గించే ఆర్థికపరమైన నిర్ణయమే కాకుండా.. భారతదేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో పాలుపంచుకోవడానికి మరింత సమర్థమైన, సుస్థిరమైన మార్గంగా కూడా మారుతోంది.

## గూగుల్‌కు రూ.30 లక్షల జరిమానా!



డిజిటల్ ప్రకటనల రంగంలో ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్న ఒక కేసులో ఢిల్లీ హైకోర్టు, గూగుల్‌పై కీలకమైన తీర్పును వెల్లడించింది. ప్రముఖ బాత్‌రూమ్ ఫిట్టింగ్స్ అండ్ శానిటరీ వేర్ తయారీ సంస్థ 'హింద్‌వేర్' ట్రేడ్‌మార్క్ హక్కులను ఉల్లంఘించిందని గుర్తించిన కోర్టు, గూగుల్‌కు రూ.30 లక్షల జరిమానా విధించింది. హింద్‌వేర్ అనేది భారతదేశంలో ప్రసిద్ధి చెందిన శానిటరీ వేర్ బ్రాండ్. వినియోగదారులు గూగుల్‌లో అని వెతికినప్పుడు, హింద్‌వేర్ వెబ్‌సైట్‌కు బదులుగా ప్రత్యర్థి కంపెనీల ప్రకటనలు ముందుగా కనిపిస్తున్నాయని సంస్థ గుర్తించింది. దీనికి కారణం.. ఆ కంపెనీలు హింద్‌వేర్ అనే పదాన్ని తమ ప్రకటనల కోసం కీవర్డ్‌గా కొనుగోలు చేయడమే. గూగుల్ యొక్క ాాంఔశీతీం (ప్రస్తుతం గూగుల్ యాడ్స్) వ్యవస్థలో కంపెనీలు తమకు కావలసిన కీవర్డ్లపై బిడ్ వేస్తాయి. వినియోగదారులు ఆ పదాలను సెర్చ్ చేసినప్పుడు, ఎక్కువ బిడ్ వేసిన కంపెనీల ప్రకటనలు పైభాగంలో కనిపిస్తాయి. ఈ విధంగా హింద్‌వేర్ పేరును ప్రత్యర్థులు ఉపయోగించుకోవడం వల్ల వినియోగదారులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని కంపెనీ వాదించింది.

### 163 పేజీల తీర్పు

ఈ కేసును విచారించిన న్యాయమూర్తి.. గూగుల్ కేవలం ఒక మధ్యవర్తి కాదని స్పష్టం చేశారు. గూగుల్ స్వయంగా కీవర్డ్లను సూచించడం, వాటి వేలాన్ని నిర్వహించడం, ప్రకటనల ప్రదర్శనను తన అల్గోరిథమ్‌ల ద్వారా నియంత్రించడం వంటి చర్యలు చేపడుతోంది. కాబట్టి ట్రేడ్‌మార్క్‌ను వ్యాపార ప్రయోజనాల కోసం ప్రదర్శించాల్సిన బాధ్యత గూగుల్‌పైనా ఉంటుందని కోర్టు తన 163 పేజీల తీర్పులో పేర్కొంది. కోర్టు అభిప్రాయం ప్రకారం.. హింద్‌వేర్ అనే ట్రేడ్‌మార్క్‌పై గూగుల్‌కు ఎటువంటి యాజమాన్య హక్కు లేదు. అయినప్పటికీ.. ఆ పేరును ప్రత్యర్థి సంస్థలకు అమ్మి లాభం పొందడం ద్వారా గూగుల్ ఆ కంపెనీ ప్రతిష్ఠను వాణిజ్యపరంగా వినియోగించుకుంది. దీనిని కోర్టు ఫ్రీ రైడింగ్ (ఇతరుల కృషి వల్ల ఏర్పడిన పేరును ఉపయోగించి లాభపడటం) అని వెల్లడించింది.

### గూగుల్ వాదన

గూగుల్ తనను తాను కేవలం ప్రకటనల వేదికగా మాత్రమే పేర్కొంటూ.. హింద్‌వేర్ సమస్యకు తాము బాధ్యులు కాదని వాదించింది. కీవర్డ్స్ అనేవి వినియోగదారుడు సెర్చ్ చేసినప్పుడు.. ప్రకటనలు చూపించ డానికి బ్యాక్ ఎండ్‌లో పనిచేసే కొన్ని సాధనాలు మాత్రమే అని వెల్లడించింది. అంతేకాకుండా.. సమాచార సాంకేతిక చట్టం, 2000లోని సెక్షన్ 79 ప్రకారం తమకు సేఫ్ హార్బర్ రక్షణ వర్తిస్తుందని తెలిపింది. అయితే కోర్టు ఈ వాదనను తిరస్కరించింది.

ఎందుకంటే.. గూగుల్ కేవలం ప్రకటనలను ప్రదర్శించడం మాత్రమే కాకుండా, ట్రేడ్‌మార్క్‌లను కీవర్డ్లుగా అమ్మి ఆదాయం పొందుతోందని గుర్తించింది. అందువల్ల గూగుల్ ఒక క్రియాశీల పాత్ర పోషిస్తోందని, సేఫ్ హార్బర్ రక్షణకు అర్హత లేదని తీర్పు చెప్పింది.

### ప్రత్యర్థి సంస్థలు

ఈ కేసులో ప్రత్యర్థి సంస్థలుగా గ్రోహే ఇండియా, ఓంకార ఇన్ఫోవెబ్, సెరా శానిటరీవేర్ కూడా ఉన్నారు. వీరు హింద్‌వేర్ పేరును లేదా హింద్‌వేర్ శానిటరీవేర్ వంటి పదాలను కీవర్డ్లుగా కొనుగోలు చేసి తమ ప్రకటనలను ప్రదర్శించారు. అయితే విచారణ సమయంలో ఈ సంస్థలు హింద్వేర్‌తో రాజీ చేసుకోవడంతో, చివరకు గూగుల్ మాత్రమే ఈ కేసులో మిగిలింది.

ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు భారతదేశంలోని డిజిటల్ మార్కెటింగ్ రంగానికి ఒక మైలురాయిగా నిలిచింది. ఇప్పటి వరకు అనేక కంపెనీలు ప్రత్యర్థి బ్రాండ్ల పేర్లను కీవర్డ్లుగా కొనుగోలు చేసి తమ వ్యాపారాలను ప్రోత్సహించేవి. ఇకపై అలాంటి చర్యలు ట్రేడ్‌మార్క్ ఉల్లంఘనగా పరిగణించబడే అవకాశం ఉంది. నితిన్ కామత్ కూడా ఈ తీర్పును స్వాగతిస్తూ, తమ సంస్థకు ఇలాంటి సమస్యలు సంవత్సరాలుగా ఎదురవుతున్నాయని, ఇప్పుడు చట్టపరమైన పరిష్కారం పొందేందుకు మార్గం ఏర్పడిందని పేర్కొన్నారు.

## వాహన లీజింగ్‌లోకి ఇసుజు మోటర్స్!

వాణిజ్య వాహనాల తయారీ సంస్థ ఇసుజు మోటర్స్ ఇండియా తమ డీ--మ్యాక్స్ ఎస్--క్యాబ్‌కి సంబంధించి దేశీయంగా లీజింగ్ విధానాన్ని ప్రకటించింది. ఈ విధానంలో నాలుగేళ్ల ఫిక్స్‌డ్ కాలవ్యవధికి, నెలవారీ అద్దె రూ. 38,999 నుంచి ప్రారంభమవుతుందని సంస్థ తెలిపింది. సంప్రదాయ ఫైనాన్స్ మోడల్‌తో పోలిస్తే కస్టమర్లకు రూ. 1.81 లక్షల మేర ఆదా అవుతుందని వివరించింది. ఫ్లీట్ ఆపరేటర్లతో పాటు వివిధ వ్యాపార వర్గాల కోసం ఈ సొల్యూషన్‌ని రూపొందించినట్లు కంపెనీ ఎండీ రాజేష్ మిట్టల్ తెలిపారు. ఇసుజు డీ-మ్యాక్స్ ఎస్-క్యాబ్ 2.5-లీటర్ ఎ+u ఇంటర్‌కూల్డ్ డీజిల్ ఇంజన్‌తో పనిచేస్తుంది. ఇది 5-స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ పొందుతుంది. ఇందులో పెద్ద కార్గో బెడ్‌తో పాటు హెవీ-డ్యూటీ సస్పెన్షన్ సెటప్ కూడా ఉంది, ఇది అధిక డిమాండ్ ఉన్న వాణిజ్య అవసరాలకు అనుకూలంగా ఉంటుంది. క్యాబిన్ లోపల, డి-మాక్స్ ఎస్-క్యాబ్ ఆరు విధాలుగా సర్దుబాటు చేయగల డ్రైవర్ సీటు, ఎయిర్ కండిషనింగ్, అనేక స్టోరేజ్ స్థలాలు, మల్టీ-ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లే వంటి ఆచరణాత్మక ఫీచర్లు ఉంటాయి.

## వైభవోపేతం.. ఊంజల్ సేవ మహోత్సవం



**(శ్రీకాళహస్తి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వరాలయంలో పున్నమి సందర్భంగా నిర్వహించిన ఊంజల్ సేవ మహోత్సవం వైభవంగా సాగింది. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్సవమూర్తులకు విశేష అలంకరణలు చేపట్టారు. ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి మండపంలోని ఉయ్యాలపై కొలువుదిద్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బి కె వెంకటేశులు, బోర్డు సభ్యులు కోలా విశాలాక్షి, గురప్ప శెట్టి పాల్గొన్నారు.

## గంగమ్మ తల్లి...కరుణించు కల్పవల్లి..

### నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ పూర్వ విద్యార్థులచే ఘనంగా గంగమ్మకు సారె సమర్పణ



**తిరుపతి సిటీ, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గంగమ్మ తల్లి కరుణించు కల్పవల్లి అంటూ పూర్వ విద్యార్థులు తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ అమ్మవారి కి మొక్కులు తీర్చుకున్నారు. తిరుపతి గ్రామ దేవత సాక్షాత్తు వెంకటేశ్వర స్వామి చెల్లెలు గంగమ్మ తల్లికి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ 83-84 సంవత్సరపు పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా సారే సమర్పించారు. అత్యంత పవిత్రంగా అంగరంగ వైభవంగా తిరుపతిలో ప్రతియేటా నిర్వహించే గంగమ్మ జాతర తర్వాత వచ్చే ఆదివారాలలో ఈ కార్యక్రమం చేయడం అత్యంత విశేషమైనదని అసోసియేషన్ కార్యదర్శి, పూర్వపు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్ ప్రస్తుత చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సెక్రటరీ కేఎల్ వర్మ తెలిపారు. ఉదయం 8 గంటలకు అసోసియేషన్ సభ్యులందరూ కుటుంబంతో కలిసి అత్యంత వైభవోపేతంగా, ఊరేగింపుగా తాతయ్యగుంట గంగమ్మ గుడికి మేళ తాళాలతో వెళ్లి అమ్మవారికి సారే సమర్పించే కార్యక్రమం పూర్తిచేసి, పట్టణ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకోవడం జరిగింది. సారే సమర్పించిన మిత్ర బృందం అందరికీ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్ మరియు ఈవో జయ కుమార్, హరి, ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహింపజేసి వేద పండితులచే ఆశీర్వచనం అందించారు. కార్యక్రమం అనంతరం అసోసియేషన్ సభ్యులచే అమ్మవారి భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. పూజా కార్యక్రమం అనంతరం గత 50 సంవత్సరములుగా కలిసి ఉన్న స్నేహితులను వారి కుటుంబ సభ్యులను పలువురు అభినందించడం జరిగింది. 50 సంవత్సరాల కాలంగా స్నేహాన్ని కొనసాగించడం ఈ కలియుగంలో, ఈ ఆధునిక యుగంలో సాధ్యం కాదని ఈ బృందంలో చాలామంది ఎల్కేజీ నుంచి ఇప్పటివరకు కుటుంబ సభ్యులందరితో కలిసి మెలసి ఉండడం,స్నేహపూర్వకంగా బాధలు, సంతోషాన్ని అందరూ పంచుకోవడం చూస్తుంటే ఆనందదాయకంగా ఉన్నదని పెద్దలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఆర్ శ్రీనివాస్, కులశేఖర్, పగడాల అర్జున్, శ్రీనివాసులు, జైచంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి, చెంగయ్య, సుబ్రహ్మణ్యం, గురుమూర్తి, రాము, రాయ్, నరేంద్ర, రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మునుస్వామి మృతి వైద్య వృత్తికి తీరని లోటు

### - కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ సంతాపం

**తిరుపతి సిటీ,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్విమ్స్ ఆస్పత్రిలో నిరుపేద రోగులకు విశిష్ట సేవలు అందించిన డాక్టర్ మునిస్వామి ఆకస్మిక మృతికి కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ప్రజా వైద్యుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న డాక్టర్ మునిస్వామి స్విమ్స్ లో ఎమర్జెన్సీ విభాగంలో రోగులకు అందుబాటులో ఉంటూ, ప్రేమ పూర్వక, ఆత్మీయ పలకరింపుతో, సేవా దృక్పథంతో వైద్య వృత్తిలో మానవీయ కోణాన్ని చాటి చెప్పారన్నారు. ఆయనతో తనకు వ్యక్తిగతంగా మంచి అనుబంధం ఉందన్నారు. డాక్టర్ మునస్వామి పేదలకు ఎంతో సేవాభావంతో వైద్య సేవలు అందించే వారిని తెలిపారు. ఆయన మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. స్విమ్స్ ఆస్పత్రికి, నిరుపేద రోగులకు, సమాజానికి తీరని లోటన్నారు. డాక్టర్ మునిస్వామి నైట్ డ్యూటీలో వుండి, ఉదయం 6 గంటల వరకు విధులు నిర్వహించి, తన స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ఈ దుర్ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

## ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, నాదస్వర పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**తిరుపతి సిటీ,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టీటీడీ ఆధ్వర్యంలో ఉన్న తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను పలు రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జూన్ 2వ తేదీ నుండి కళాశాలలో దరఖాస్తులు జారీ చేస్తారు. పూర్తిచేసిన దరఖాస్తులను జూన్ 30వ తేదీ వరకు స్వీకరిస్తారు.కళాశాలలో ఫుల్ టైమ్ / పార్ట్‌టైమ్ వ్యవధి గల కోర్సులలో గాత్రం, వీణ, వేణువు, వయోలిన్, నాదస్వరం, డోలు, భరతనాట్యం, కూచిపూడి నృత్యం, హరి కథ, మృదంగం, ఘటం విభాగాలున్నాయి. బి.మ్యూజిక్, బి డ్యాన్స్, విశారద, ప్రవీణ కోర్సులున్నాయి. ఎస్వీ నాదస్వర పాఠశాలలో సర్టిఫికేట్, డిప్లొమా రెగ్యులర్ కోర్సులతోపాటు సాయంత్రం కళాశాల పార్ట్‌టైమ్ కోర్సులున్నాయి.ఆసక్తి గల అభ్యర్థులు కళాశాల కార్యాలయ పనివేళల్లో రూ.50/- చెల్లించి దరఖాస్తు పొందొచ్చు. రెగ్యులర్ కోర్సులకు 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. సాయంత్రం కళాశాలకు 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. రెగ్యులర్ కోర్సు చదివే విద్యార్థులకు మాత్రమే నిబంధనలకు లోబడి హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుంది. ఇతర వివరాలకు 0877-2264597, 9848374408, 9440793205,9642796991నంబర్లనుసంప్రదించాలని కోరారు.




## తుమ్మలగుంటలో ఘనంగా పౌర్ణమి గరుడ సేవ

**తిరుపతి,మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి నెలా వచ్చే పౌర్ణమి రోజున తిరుమల తరహాలో గరుడ వాహన సేవను నిర్వహించడం ఆనవాయితీ. ఆ మేరకు ఆదివారం రాత్రి పౌర్ణమి గడియల్లో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారు మలయప్ప స్వామి అలంకరణలో గరుడునిపై కొలువుదీరి భక్తులకు అభయ ప్రదానం చేశారు. పౌర్ణమి గరుడ సేవ తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులు, వారి తనయులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు గరుడ వాహన సేవలో పాల్గొన్నారు. గరుడ వాహన దారుడైన శ్రీనివాసుని దర్శనార్థం చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్తులు గోవిందనామ స్మరణలు, కర్పూర హారతులతో మొక్కులు తీర్చుకున్నారు.

## జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### - ఎండ తీవ్రత దృష్ట్యా అత్యవసరం అయితేనే ఫిర్యాదుదారులు జిల్లా కలెక్టరేట్‌కు రావాలి

### - జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జూన్ 01 వ తేదీ సోమవారం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో ఆర్డీవో కార్యాలయాల్లో పి జీ ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండల కార్యాలయంలో తహశీల్దారులు, ఎంపీడీవోలు, ఇతర మండల అధికారులు, ఆర్డీవో కార్యాలయాల్లో రెవిన్యూ డివిజనల్ అధికారి, ఇతర డివిజనల్ అధికారులు పాల్గొని వినితలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. మండల, రెవెన్యూ డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలకు సంబంధించి ప్రజలు తమ అర్జీలను మండల కార్యాలయాలు లేక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో తమ వినతులను సమర్పించవచ్చని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న దృష్ట్యా అత్యవసరమైతే తప్ప అర్జీదారులు వినతులు సమర్పించడానికి వ్యయ ప్రయాసలకు ఓర్చి జిల్లా కలెక్టరేట్ కు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవఎశీయిఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తిరుమలలో వైభవంగా పౌర్ణమి గరుడసేవ



**తిరుమల, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు ధగధగా మెరిసిపోతున్న గరుడునిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. గరుడ వాహనం - సర్వపాప ప్రాయశ్చిత్తం పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాలలోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజెబుతారు. ఈ కార్యక్రమంలో తిరుమల చినజీయర్ స్వామి, టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, జేఈవో (ఆరోగ్యండవిద్య) డాక్టర్ శరత్, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## పవిత్ర గోదావరి పవన్ కళ్యాణ్ లక్ష్యం

### -ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్



**తిరుపతి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గోదావరి నదిని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. పంచాయితీలు, పరిశ్రమలు, ఆక్వా రంగం నుంచి వచ్చే వ్యర్థాలు గోదావరిలో కలవకుండా చర్యలు తీసుకునేందుకు వంద కోట్లు కేటాయించారని ఆయన చెప్పారు. తన కార్యాలయంలో ఆదివారం సాయంత్రం మీడియాతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడారు. గోదావరి పుష్కరాలు 2027 జూన్ లో జరగనున్నాయాని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. అయితే గోదావరి పరివాహక ప్రాంతాల్లోని 262 పంచాయితీల మురుగునీరు నది కలవకుండా చూడటమే కాకుండా మున్సిపాల్టీల వ్యర్థాలు, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాలను గోదావరిలో కలిపే ప్రాంతాలను పవన్ కళ్యాణ్ ఆదేశాలతో అధికారులు గుర్తించి సిసి కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశారని ఆయన చెప్పారు. ఆర్టీజీఎస్ తరహాలో కంట్రోల్ రూమ్స్ పని చేసేలా పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకున్నారని ఆయన తెలిపారు. స్వచ్ఛ గోదావరి - పవిత్ర పురష్కరాలు పేరిట పవన్ కళ్యాణ్ తీసుకుంటన్న చర్యలు ఫలిస్తాయన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన గోదావరి ప్రక్షాళనకు పూర్తి మద్దతు పలుకుతున్నారని ఆయన చెప్పారు. ఈ మీడియా సమావేశంలో జనసేన నాయకులు రాజా రెడ్డి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆముదాల వెంకటేష్, రాజేష్ ఆచ్చారి, ప్రభాకర్ రెడ్డి,జీవకోన సుధా,మణి,శ్రావణ్ పాల్గొన్నారు.

## డాక్టర్ మునస్వామి మృతికి సిఐటియు తీవ్ర సంతాపం

**తిరుపతి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పేదల డాక్టర్, రోగులు పిలిస్తే నేనున్నానంటూ పలికే ఉత్తమ వైద్యులు డాక్టర్ కె. మునస్వామి ఆకస్మిక మరణం సమాజానికి, పేద ప్రజలకు తీరని లోటని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని, తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తున్నానని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో తెలిపారు. సూళ్లూరుపేట లోని వారి సొంత గ్రామానికి వెళుతూ డాక్టర్ మునస్వామి కారులో ప్రమాదానికి గురై ఆదివారం నాటి ఉదయం మరణించారని, అంత్యక్రియలు సూళ్లూరుపేట సమీపంలోని వారి సొంత గ్రామం మాంబట్టు లో జూన్ 1వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు జరుగుతాయని, వారి కుటుంబ సభ్యులు తెలియజేసినట్లు కందారపు మురళి తెలిపారు.

## నేడు 'డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి'

**తిరుపతి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం జూన్ 1వ తేదీన ఉదయం 10:00 గంగల నుంచి మధ్యాహ్నం 12:30 గంగల వరకు 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమాన్ని ఏపీఎస్పీడీసీఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు: 8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమంతో పాటు సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 నుంచి 9:30 గంగల వరకు 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను సూపరింటెండింగ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ క్రింద పేర్కొన్న నంబర్లకు కాల్ చేయవచ్చు.తిరుపతి: 8712652679,చిత్తూరు: 7993147979,నెల్లూరు: 08612320427,అన్నమయ్య: 9440817449,కడప: 08562242457, కర్నూలు: 7382614308, నంద్యాల: 7382618976, అనంతపురం: 9154790350,శ్రీసత్యసాయి: 9490615721.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

**తిరుపతి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఎ. సి) శారదా దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జూన్ 1వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ (ఎఫ్.ఎ.సి) శారదా దేవి తెలియజేశారు.

## ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు ప్రీ-పెయిడ్ విధానం నేటి నుంచి అమలు

### - ఎస్పిడిసిఎల్ లో 15 కోట్లతో 34,496 ప్రీ-పెయిడ్ సర్వీసులకు రీఛార్జ్



**తిరుపతి, మే 31 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రీ-పెయిడ్ విధానం ఈ యేడాది జూన్ 1వతేదీ నుంచి అమల్లోకి రానుంది. సంస్థ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర సర్వీసులకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల విద్యుత్ వినియోగం, బిల్లింగ్ అంశాల్లో పాదర్శకతను పెంపొందించేందుకు వీలుగా స్మార్ట్ మీటర్లను ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లుగా మార్చాలని సంస్థ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ విద్యుత్ సర్వీసుల బకాయిల సమస్య నుంచి బయటపడడమే కాకుండా విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ కొనుగోలు సామర్థ్యంపై ఒత్తిడిని అధిగమించేందుకు ప్రీ-పెయిడ్ విధానం తోడ్పాటునందిస్తోంది. ప్రీ-పెయిడ్ మీటరింగ్ ద్వారా విద్యుత్ వినియోగాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవడం, విద్యుత్తు పొదుపు, బిల్లును ఆదా చేసుకునేందుకు అవకాశం వుంటుంది. అంతేకాకుండా ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారుల్లో జవాబుదారీతనం మరింత పెరుగుతుంది.

**రూ. 15 కోట్లతో 34,496 సర్వీసులకు రీఛార్జ్**

ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్లు/మున్సిపాలిటీలు, వాటర్ వర్క్స్, వీధి దీపాలు తదితర ప్రధాన సర్వీసులకు సంబంధించి నెల్లూరు జిల్లాలో 4,735 సర్వీసులకు రూ. 1.19 కోట్లు, తిరుపతి జిల్లాలో 4,942 సర్వీసులకు రూ. 2.29 కోట్లు, చిత్తూరు జిల్లాలో 4,193 సర్వీసులకు రూ. 1.63 కోట్లు, అన్నమయ్య జిల్లాలో 4,324 సర్వీసులకు రూ. 1.68 కోట్లు, కడప జిల్లాలో 4,520 సర్వీసులకు రూ. 1.98 కోట్లు, అనంతపురం జిల్లాలో 2,829 సర్వీసులకు రూ. 1.41 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లాలో 2,432 సర్వీసులకు రూ. 88.81 లక్షలు, కర్నూలు జిల్లాలో 3,243 సర్వీసులకు రూ. 1.63 కోట్లు, నంద్యాల జిల్లాలో 3,278 సర్వీసులకు రూ. 1.54 కోట్లతో సంస్థ రీఛార్జ్ చేయడం జరిగింది. ఈ సర్వీసులన్నింటినీ కొన్ని గ్రూపులుగా ఏర్పాటు చేసి, ఈ-వాలెట్ ద్వారా రీచార్జ్ రీఛార్జ్ ప్రక్రియను చేపట్టడం జరుగుతుంది. ఆయా విభాగాలు బిల్లింగ్ సైకిల్ కు సంబంధించిన విద్యుత్ చార్జీలు, స్థిర చార్జీల మొత్తాన్ని అడ్వాన్సుగా చెల్లించడం జరుగుతోంది. పరిధిలో మిగిలిన ప్రభుత్వ సర్వీసులకు కూడా దశలవారీగా ప్రీ-పెయిడ్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చేందుకు సంస్థ అవసరమైన చర్యలు చేపడుతోంది.

**రీఛార్జ్ చేసుకుంటేనే విద్యుత్తు: సిఎండి శివశంకర్ లోతేటి**

ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు ప్రీ-పెయిడ్ విధానం ద్వారా రోజువారీ విద్యుత్ వినియోగ చార్జీలను బ్యాలెన్స్ నుంచి మినహాయించడం, ఆ బ్యాలెన్స్ నిర్దిష్ట కనిష్ట పరిమితి దిగువకు చేరిన వెంటనే సంబంధిత అధికారులకు ఈ-మెయిల్/ఎస్ఎంఎస్ రూపంలో సమాచారాన్ని తెలియజేయడం జరుగుతుంది. ప్రీ-పెయిడ్ బ్యాలెన్స్ సున్నాకు చేరినపుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఈ అంశాన్ని ప్రభుత్వ ప్రీ-పెయిడ్ సర్వీస్ వినియోగదారులు గుర్తించుకోవాలి.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027